







అన్నవరం

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఎన్నెన్నో.. అందాలు


పాపికొండల విహారం


అందంగా తూర్పు ఏజెన్సీ


సముద్రతీర ప్రాంతం

గోదావరి జిల్లాలు.. ప్రకృతి అందాలకు కేరాఫ్ అడ్రస్. అడుగడుగునా ఓ ప్రత్యేకత. ఆకుపచ్చని లోకంలో విహరించాలంటే ఖచ్చితంగా ఇక్కడకు రావాల్సిందే. ప్రకృతి రమణీయతకు అద్దంలా కనిపించే పచ్చని పైరు పంటలు.. కోనసీమ కొబ్బరి తోటల అందాలు ఎవరినైనా ఈ కొత్త లోకంలో విహరింపజేస్తాయి. ఇక పేరులోనే ఉన్న గోదావరి.. పరవళ్లు తొక్కే గోదావరికి ఆనుకుని పరుగులు పెట్టే పంట కాల్వలు, మరోవైపు దట్టమైన అడవి.. అందులో ఎగిసిపడే వాగులు..వంకలూ.. మరోవైపు పాపికొండల వయ్యారాలు..ఇటు చూస్తే అంతమే లేదన్నట్టు సాగిపోయే తీరంలో సముద్రపు అలల సవ్వడి.. ఇంకా కడియం పూలతోటలు.. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే ఆలయాలు.. అన్నిటికీ మించి అన్నవరం దేవాలయం. పర్యాటకం అంటే ఊటీకో, గోవాకో వెళ్లడం కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రండి.. చూస్తే పరవశించిపోవాల్సిందే..

- కాకినాడ/ రాజమహేంద్రవరం/ అమలాపురం (ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో ఊటీ..కొడైకెనాల్‌ను తలదన్నే పర్యాటక ప్రాంతాలు

ఓ వైపు కొబ్బరి చెట్లతో తివాచీ పరిచినట్టు పచ్చగా కనిపించే కోనసీమ.. ఇంకో వైపు గోదావరి నడుమ పాపికొండల వయ్యారాలు.. మరో వైపు మారేడుమిల్లి అటవీ అందాలు.. ఇంకోపక్క కాకినాడ సమీపంలో కోరింగ అభయారణ్యం.. ఇలా చెప్పుకుంటూపోతే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువేలేదు. కోరుకొండ, ఆదుర్రు, కొడవలిలో బౌద్ధ స్తూపాలు, పెద్దాపురంలో పాండవులమెట్ట వంటి చారిత్రక ప్రదేశాలెన్నో ఉన్నాయి. ఇక అన్నవరం, అప్పనపల్లి, అంతర్వేది, అయినవిల్లి, మురమళ్ల, ముక్తేశ్వరం, వాడపల్లి, కోటిపల్లి, ర్యాలీ, ద్రాక్షారామ, పిఠాపురం తదితర ప్రాంతాల్లో చారిత్రక దేవాలయాలూ ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న పాపికొండల విహారం ఆహ్లాదభరితం. ఎత్తయిన కొండలు, అటవీప్రాంతం మీదుగా వంపులు తిరుగుతూ ప్రవహించే గోదావరి అందాలను బోటులో నుంచి వీక్షించవచ్చు. గోదావరి తీరంలో ఉన్న చారిత్రక నగరం రాజమహేంద్రవరం. గోదావరి గట్టున ఉన్న రాళ్లబండి మ్యూజియం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ, గౌతమి గ్రంథాలయం, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం ఇల్లు, పెద్ద మసీదు వంటివి చూడదగ్గవి. గోదావరి తీరంలో గౌతమిఘాట్‌ను ఆనుకుని టెంపుల్ స్ట్రీట్‌లో ఇస్కాన్ తదితర ఆలయాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం అఖండ గోదావరిలో బోట్ షికారు నిర్వహిస్తున్నా సరైన నిర్వహణ లేక దానికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. పుష్కర ఘాట్‌లో నిత్య హారతి కార్యక్రమం వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కింది. రాజమహేంద్రవరానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధవళేశ్వరంలో 1852లో కాటన్ మహాశయుడు నిర్మించిన బ్యారేజీ తప్పక చూడాల్సిందే. రూపాయి ఖరీదు చేసే మొక్క నుంచి లక్షల విలువ చేసే దేశ, విదేశీ రకాల మొక్కలూ కడియం మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటుచేసిన 600 నర్సరీల్లో కనిపిస్తాయి. వశిష్ఠ పాయ ఒడ్డున కోనసీమలో కొలువుదీరిన దిండి దశాబ్దకాలంలో పర్యాటకంగా బాగా ప్రాచుర్యం పొందింది. హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్స్ పేరుతో ఏపీ టూరిజం ఇక్కడ రిసార్ట్స్ నిర్వహిస్తోంది. దిండిలో కేరళ తరహాలో ఉన్న హౌస్ బోట్లు ద్వారా నదీవిహారాలు సాగిస్తుంటారు. దిండి రిసార్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతి గదులతో పాటు నాలుగు హౌస్‌బోట్లు, ఒక వశిష్ఠ బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. దిండిలో టూరిజం రిసార్ట్స్‌తో పాటు సమీపంలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఆదుర్రులో బౌద్ధస్థూపం చరిత్రకెక్కింది. కాట్రేనికోన మండలం కందికుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవుల్లో పడవల ద్వారా విహారయాత్ర సాగించడానికి అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రసిద్ధి చెందిన ఓడలరేవు, కొమరగిరిపట్నం, కేశనపల్లి, కేశవ దాసుపాలెం,అంతర్వేది, ఎస్.యానాం, చిర్రయానం బీచ్‌లు వేలాదిమందితో కళకళలాడుతున్నాయి. కోనసీమలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, గౌతమీనది చెంతన అయినవిల్లి సిద్ధి వినాయక, క్షణముక్తేశ్వరస్వామి, మురమళ్ళ వీరేశ్వర స్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, కడలిలో కపోతేశ్వర స్వామి, వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి, మందపల్లిలో శనేశ్వరస్వామి, ర్యాలిలో జగన్మోహినీ ఆలయాలు ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి.

రూ.100 కోట్లతో అఖండ గోదావరి

కూటమి ప్రభుత్వం తాజాగా పర్యాటక రంగంపై దృష్టిపెట్టింది. వచ్చే ఏడాది మార్చి నాటికి కొత్త పర్యా టక పాలసీని తీసుకొని రావడానికి కసరత్తు చేస్తోంది. గోదావరి జిల్లాల్లో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ జిల్లాకు చెందినవారే కావడంతో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందు తుందనే ఆశలు చిగురించాయి.అఖండ గోదా వరి కి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు ఆయన స్పష్టం చేసి న సంగతి తెలిసిందే. ఇప్పటికే కడియం నర్సరీలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అక్కడ కాలువ లో బోట్ షికారు పెట్టనున్నా రు. పాపికొండలు ఇప్పటికే బోట్ షికారుతో ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే.


మడ అడవులు

మడ అడవులు చూస్తే..మరువరు

దేశంలో పశ్చిమబెంగాల్ తర్వాత రెండో అతిపెద్ద మడ అడవులు కాకినాడలోనే ఉన్నాయి. వేల ఏళ్ల నాటి ఈ మడ అడవులు కాకినాడ నగరానికి రక్షణ గోడగా నిలుస్తున్నాయి. సునామీలు, వరదలు, తుపాన్ల నుంచి కాకినాడతో పాటు కోనసీమలో ఎన్నో ప్రాంతాలను రక్షిస్తున్నాయి. నదీ జలాలు సముద్రంలో కలిసే చోట చిత్తడినేలల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీటిలో చెట్లు పెరగవు. కానీ ఇవి అందులోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు, పొదల సముదాయమే మడ అడవులు. తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. నది.. సముద్రంలో కలిసే ప్రదేశంలో సహజసిద్ధంగా పుట్టుకువచ్చే ఈ మడఅడవులు ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్రం గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తించారు. ఇందులో కోరంగి అభ యారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కి.మీలో విస్తరించి ఉంది.వీటిలో 80 రకాల వృక్షజాతులున్నాయి.అతిపెద్దదైన కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతుల మడ మొక్కలున్నాయి. ఇక్కడకు ఏటా 120 జాతుల పక్షులు వచ్చి విడిది చేస్తుంటాయి. ఎంతో మంది పర్యాటకులు వస్తున్నా సరైన సదుపాయాలే లేవు.

ఏజెన్సీ అందాలకు వెలుగేది..

చూపుతిప్పుకోలేని ప్రకృతి అందాలు తూర్పు ఏజెన్సీ సొంతం. మారేడుమిల్లి సమీపంలో అటవీశాఖ ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్వహిస్తోంది. వనవిహారి పేరుతో మారేడుమిల్లిలో రిసార్ట్స్‌లో వసతి ఏర్పాట్లు కల్పించారు. ఈ రిసార్ట్స్‌లో స్టే చేయాలంటే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవాలి. ఎకో టూరిజంలో ప్రధానమైన పర్యాటక ప్రాంతం జంగిల్ స్టార్. ఇది పాములేరు వాగు పక్కనే ఉంది. పాములేరు బ్రిడ్జి నుంచి కిలోమీటరున్నర దూరం ఉంటుంది. జంగిల్ స్టార్ నేచురల్ క్యాంపులో గడిపాలనుకునే వారికి ఒక రాత్రంతా అడవిలో గడిపిన అనుభూతి కలుగుతుంది. కొంతకాలంగా గుడిసె అందాలను ఆస్వాదించడానికి పెద్దఎత్తున పర్యాటకులు వస్తున్నారు. వెదురుబొంగులలో పెట్టి తయారుచేసిన బొంగు చికెన్, బొంగు బిర్యాని ఇక్కడ స్పెషల్. మారేడుమిల్లికి 6 కిలోమీటర్ల దూరంలో జలతరంగిణి, కాఫీ తోటలు పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తాయి. ఇటు రంపచోడవరానికి 6 కిలోమీటర్ల దూరంలో రంప ఉంది. ఇక్కడ 14వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం ప్రాశస్త్యం పొందింది. శివాలయానికి కిలోమీటరు కొండపైకి వెళితే జలపాతం ఆకట్టుకుంటోంది. ఇన్ని అందాలున్నా వాటి అభివృద్ధికి మాత్రం ఎలాంటి చర్యలు లేవు. కూటమి ప్రభుత్వం దృష్టి పెడితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యాటకరంగానికి మరింత శోభ చేకూరుతుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడేలా చేయడానికి రంగం సిద్ధమవుతోంది. హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు నుంచి మడ అడవుల వరకు అభివృద్ధి చేయడానికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి.

అందాలున్నా..ఆదరించలేదు..

ఓ వైపు సువిశాల సముద్ర తీరం..మరోవైపు జలజల పారే నదీ జలాలు..ఈరెండింటి మధ్య పొదలుగా..గుబురుగా.. సూర్యుడి వెలుతురు కూడా చొరబడనంత దట్టం గా విస్తరించిన మడ అడవులు.. కాకి నాడ కాజా..ఎన్టీఆర్ బీచ్..కుంభాభిషేకం.. అన్నవరం, పాదగయ..ఉప్పాడ బీచ్..ఉప్పాడ చీరలు.. పెరుమాళ్లపురం పాకంగారెలు.. చిట్టి ముత్యాల బిర్యానీ.. చిట్టిపెసరట్టు..ఇలా ఒకటేంటి కాకినాడ అంటే పర్యా టకులకు ఇలా చాలానే గుర్తొచ్చేవి.. పర్యాటకులను ఆక ర్షించే అవకాశం ఉన్నా గత వైసీపీ ప్రభు త్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసేసింది.పైసా నిధులు కూడా విదల్చకుండా పర్యాటక రంగానికి తూట్లు పొడిచింది. గడచిన ఐదేళ్లలో పర్యాటక రంగం పడకేసింది. వాస్తవానికి 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో పర్యాటక రంగానికి భారీ ఊపుతెచ్చింది. కాకి నాడ నుంచి ఉప్పాడ వరకు ఉన్న బీచ్‌రోడ్డును అభివృద్ధి చేసి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించింది.ఎన్టీఆర్ బీచ్‌ను అభివృద్ధి చేసి పర్యాటక ఉత్సవాలు, రోజుల తరబడి బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించింది.వైసీపీ వచ్చాక వీటన్నింటికి మంగళం పాడేసింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పర్యాటక అభి వృద్ధిపై దృష్టి సారించింది. పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్ ఇప్పటికే సీఎం వద్ద పలు ప్రతిపాదనలు ఉంచారు. కాకినాడ జిల్లాలో అన్నవరం,పాదగయ, సామర్లకోట భీమేశ్వర ఆలయం.. ఉప్పాడ బీచ్ కలిపి టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం పవన్ ఈ దిశగా హామీ కూడా ఇవ్వడంతో దీని అమలుపై కార్యాచరణ ప్రణాళికలు రచిస్తున్నారు.

- పర్యాటకానికి చిరునామా 'తూర్పు'
- గోదారి పరవళ్లు.. పచ్చని కోనసీమ
- అపార బీచ్‌లు.. ఏజెన్సీ అందాలు
- ఆధ్యాత్మికత.. పూల సోయగాలు
- కూటమి దృష్టిపెడితే..ఆదాయవనరు
- పట్టించుకుంటే ఇదే స్వర్గసీమ
- నిధుల లేమితో ప్రాజెక్టులు మూలకు
- పర్యాటకంగా కానరాని అభివృద్ధి
- తాజాగా రూ.100 కోట్లతో ప్రాజెక్టు

వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీ..



వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీని తీసుకుని రానున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ వచ్చే మార్చి వరకూ అమలులో ఉంటుంది. మార్చి తర్వాత కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. రాబోయే ఐదేళ్లలో పర్యాటక రంగ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. అఖండ గోదావరి ప్రాజెక్టుతో రాజమహేంద్రవరం అఖండ గోదావరి, కడియం, హేవలాక్, చారిత్రిక కట్టడాలు, అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలోని ప్రాంతాలు, పశ్చిమగోదావరి జిల్లాలో పేరుపాలెం బీచ్ వంటివన్నీ అభివృద్ధి చేస్తాం. - **కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి**

రాజమహేంద్రి ఆర్‌డీవోగా కృష్ణనాయక్

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఆర్డీవోగా రమావత్ కృష్ణనాయక్, కొవ్వూరు ఆర్డీవోగా రాణి సుస్మిత నియమితులయ్యారు. టూరిజం రాజమహేంద్రవరం ఆర్‌డీ వి.స్వామినాయుడును పలాస ఆర్డీవోగా నియమించారు.ఈ మేరకు గురువారం రాత్రి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎస్‌ఐ, హెచ్‌సీలకు కౌన్సెలింగ్
నేడు 250 మంది కానిస్టేబుళ్లకు..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది బదిలీ ప్రక్రియ మొదలైంది.ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఐదేళ్లగా ఒకే చోట పనిచేస్తున్న సుమారు 80 మంది ఏఎస్ఐ, హెచ్‌సీలతో స్వయంగా మాట్లాడి నిర్ణయం తీసుకున్నారు. సిబ్బంది వినతులను పరిగణనలోకి తీసుకొని వారు కోరిన పోలీస్‌స్టేషన్‌లో ఖాళీ ఉంటే కేటాయించారు. 250 మంది కానిస్టేబుళ్లకిశుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఇరిగేషన్‌లో పలువురు బదిలీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్‌లో పలువురు బదిలీ అయ్యారు. పులిచింతల ప్రాజెక్టు సర్కిల్ పరిధిలో డీఈగా పనిచేస్తున్న రెడ్డెం అప్పారావు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ధవళేశ్వరం సీఈ పరిధిలోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు జంగారెడ్డిగూడెం ఎస్ఈగా నియమితులయ్యారు. పీపీఐ డివిజన్ -3లోని ధవళేశ్వరం ఎస్ఈగా ఉన్న పాకనాటి వేంకటేశ్వర్లు క్వాలిటీ కంట్రోలు సీఈగా నియమితులయ్యారు. మతం దక్షిణమూర్తి, పమ్మి నాగార్జున రావు, ఎస్.జగదీశ్వరరావు ,కలిగితిరాజు, కిలివేటి రమేష్ తదితరులకు ధవళేశ్వరం సర్కిల్‌లో పోస్టింగ్ దక్కింది.

మైన్స్ ఏడీగా ఫణిభూషణ్‌రెడ్డి బాధ్యతలు

జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎం.సుబ్రహ్మణ్యం కడప బదిలీ అయ్యారు.

రూ.5 కోట్ల స్థలం.. హాంఫట్!



- హుకుంపేటలో ఇంటి దొంగలు
- పంచాయతీ కామన్ సైట్ కబ్జా
- కోర్టు తీర్పు ఇచ్చినా నో పెన్సింగ్
- పీజీఆర్ఎస్‌లో కూటమి ఫిర్యాదు
- నేటికీ పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 26 : ఇంట్లో దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడన్నది సామెత..ఆ సామెతకు నిలువెత్తు నిదర్శనంగా కొంత మంది అధికారుల తీరు ఉంది. అయినా పట్టించుకునేవారే లేరు.. గతంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే అధికారులు అడ్డుకునేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారుల తీరులోనూ మార్పువచ్చింది. కబ్జాదారులకు అధికారులే సహకరించి..ఎంతో కొంత స్థలం తీసుకునే కొత్త విధానానికి ఆజ్యం పోశారు. రాజమహేంద్రవరం రూరల్‌లో జరిగే సంఘటనలే అందుకు నిదర్శనం. దీంతో కబ్జాదారులు ఇష్టానుసారం రెచ్చిపోయి ప్ర భుత్వ భూముల ఆక్రమణలకూ దిగారు.కలెక్టరేట్‌కు కూతవేటు దూరం.. అయినా కబ్జాలకు అంతే లేకుండాపోయింది. ఒక పక్క ధవళేశ్వరం మరో పక్క హుకుంపేటలో కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగు తోంది. కబ్జాదారులకు అధికారులు సహకరించడంతో కొన్ని భూముల వ్యవహారాలు దశాబ్దకాలం దాటినా బయటపడలేదంటే ఎలా పావులు కదిపారో అర్థం చేసుకోవచ్చు.

1333 గజాల స్థలం ఆక్రమణ..

రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట పంచాయతీ పరిధి రామకృష్ణ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ ప్రాంతంలో వేసిన ఎల్‌పి నంబరు 624/85 లేఅవుట్‌కు సంబంధించి సామాజిక స్థలం (కామన్‌సైట్) సుమారు 1333 గజాలు హుకుంపేట పంచాయతీలో పనిచేస్తున్న వారితో పాటు పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న ఆరుగురు ఏకంగా రిజిస్టరు చేయించుకున్నారు. ఈ విషయం బయటకు రావడంతో అప్పటి డీఎల్‌పీవో కోటేశ్వరబాబు విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు సంబంధిత స్థలం పంచాయతీకి సంబంధించిందంటూ నివేదిక సమర్పించారు. ఫోర్జరీ డాక్యుమెంట్లపై అమ్మిన వారితో పాటు కొనుగోలు చేసిన వారిపై కూడా క్రిమినల్ కేసులు బనాయించాలంటూ డీఎల్‌పీవో ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత స్థలం కొనుగోలుదారులు 2010లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణల అనంతరం జనవరి 2011లో ఈ స్థలం పంచాయతీకి చెందిన సామాజిక స్థలం అని కోర్టుతీర్పునిచ్చింది. అటుపై పంచాయతీ అధికారులు ఆ స్థలం గురించి పట్టించుకోలేదు. పంచాయతీ కార్యదర్శిగా విధులు చేపట్టి ఇటీవల పదవీ విరమణ పొందిన శ్రీనివాస్ ఎస్.వెంకట సూర్యనారాయణ తదితరులు ఇంటి నిర్మాణం కోసం ప్లాన్ అప్రూవల్ ఇచ్చేశారు.. అప్పటి డీఎల్‌పీవోగా విధులు నిర్వహిస్తున్న కేపీ చంద్రశేఖర్ గాని సంబంధిత అధికారులు గాని ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కోర్టు ఆర్డరు అనుకూలంగా ఉన్నా కోట్లాది రూపాయల విలువ చేసే స్థలానికి పెన్సింగ్ కూడా వేయలేక పోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం అక్కడ గజం విలువ సుమారు రూ.40 వేలు పైనే ఉంది.అంటే ఈ లెక్కన స్థలం విలువ రూ. 5.32 కోట్లు ఉంటుంది. ఇదే విషయమై ఇటీవల పీజీఆర్ఎస్‌లో కూటమి నాయకులు మత్సేటి ప్రసాద్, ముద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ తదితరులు ఫిర్యాదు చేసారు. రూరల్ మండలం పరిధి పిడింగొయ్యి పంచాయతీలో సుమారు 70 అధికారిక లేఅవుట్లు ఉండగా 6వ లేఅవుట్లలో సామాజిక స్థలం కబ్జాకు గురైనట్టు తెలుస్తుంది.మరి కొన్ని చోట్ల పంచాయతీ అధికారుల సహకారంతో ఏకంగా ఇళ్ళ నిర్మాణాలే చేపట్టారు. ఇటువంటివి క్షేత్రస్థాయిలో చాలానే ఉంటాయి.

పెన్సింగ్ వేయమని ఆదేశించిన డీపీవో..

హుకుంపేట ఎఫ్‌సీఐ కాలనీ ప్రాంతంలో కబ్జాకు గురైన స్థలానికి పెన్సింగ్ వేయాలంటూ అప్పటి డీపీవో రాంబాబు గ్రామ కార్యదర్శి వెంకట్రావును ఈ నెల మొదటి వారంలో ఆదేశించారు. కోర్టు ఆర్డరు అనుకూలంగా ఉన్నా నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారంటూ నిలదీశారు. అయినా ఇప్పటికీ పెన్సింగ్ వేయకుండా వదిలేశారు.

దివ్యాంగులతో ఆటలా!?



సదరం శిబిరానికి కానరాని ఏర్పాట్లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26 : దివ్యాంగులతో అధి కారులు సదరంగం ఆడు తున్నారు. ఎంతో కష్టపడి ఆసుపత్రికి వచ్చినా వారికి కనీస సౌకర్యాలు కానరాక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతి గురువారం సదరం శిబిరం నిర్వహిస్తు న్నారు. శాశ్వత అంగవైకల్యానికి రూ.15 వేలు పింఛను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో దివ్యాంగులు తరలివస్తున్నారు.అయితే అందుకు తగినట్టు ఏర్పాట్లు మాత్రం చేయ డంలేదు. ఈ వారం కూడా దివ్యాంగులు భారీగా తరలిరావడంతో జీజీహెచ్ ఆవరణ అంతా నిండిపోయింది. సాధారణ ఓపీ నమోదు కేంద్రంలోని మహిళా విభాగం కిటకిటలాడింది. దరఖాస్తులను పరిశీలించి ఆయా విభాగాలకు పంపే ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగడంతో సంబంధిత విభాగాల వైద్యులు అసహనం వ్యక్తం చేశారు. దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా కనీస చర్యలు తీసుకోకపోవడం, అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ విషయంలో వచ్చే గురువారమైనా తగిన జాగ్రత్తలు తీసుకుంటారా లేదా అనేది చూడాలి.

నర్సరీల మాటున చిరుత పులి

7

అటవీ అధికారుల జల్లెడ



కాకినాడ జీజీహెచ్‌లో ముగిసిన
క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 26: స్త్రీలలో సంభవించే పలు క్యాన్సర్లను నిర్మూలించే లక్ష్యంతో కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23 నుంచి నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి మాట్లాడుతూ 350 మందికి పరీక్షలు నిర్వహించగా వీఐఏ పరీక్షలో 44 కేసులు పాజిటివ్‌గా గుర్తించామన్నారు. వారిలో 43 మందికి చికిత్స అందిస్తుండగా మరొకరిని బయాప్సీ పరీక్ష చేయించుకోవాలని సూచించామన్నారు. వీఐఏ పరీక్ష, కోయాగ్యులేషన్ చికిత్స అందించడంపై స్థానిక వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు, నర్సులకు అమెరికా నుంచి వచ్చిన వైద్య నిపుణుల బృందం శిక్షణ ఇచ్చిందన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. థర్మల్ కోయాగ్యులేషన్ పరికరాన్ని అమెరికా వైద్య నిపుణులు జీజీహెచ్‌కు వితరణ చేశారు. శిబిరం విజయవంతమైన సందర్భంగా అమెరికా వైద్య బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఐఎస్‌సీసీ అధ్యక్షుడు జీన్ టాల్బర్ట్ ఫాకోగ్, భారత ప్రతినిధి డాక్టర్ సమత కడియాల, అమెరికన్ కాలేజీ ప్రసూతి, గైనకాలజిస్టులు డాక్టర్ సుసాన్ కోక్రాన్, డాక్టర్ కరోల్ హాబాచ్, జీజీహెచ్ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసన్, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ అనురాగమయి, డాక్టర్ లక్ష్మీకిరణ్, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వు అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

ఎంపీహెచ్‌ఏలకు నియామక
ఉత్తర్వులు అందజేత

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 26: హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 186 మంది ఎంపీహెచ్‌ఏ(ఎం)-2002 అభ్యర్థులకు కండిషనల్ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఎంపీహెచ్‌ఏ (ఎం) అభ్యర్థులు కొంతమంది కోర్టుకి కంటెస్ట్ చేయగా.... కోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు అభ్యర్థుల అర్హతలను పరిశీలించారు. విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 86 మంది సీసీలకు గాను 185 మంది అభ్యర్థులకు కౌన్సిలింగ్ ద్వారా కండిషనల్ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు అందించారు.

కొండ చిలువ హతం



కిర్లంపూడి, సెప్టెంబరు 26: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురంలో పది అడుగుల కొండ చిలువ హల్‌చల్ చేసింది. ఇటీవల ఏలేరు వరదల్లో కొండ చిలువలు కొట్టుకొచ్చాయని గ్రామస్తులు తెలిపారు. గత ఆదివారం ఏలేరు కాలువలో కొండచిలువ కొట్టుమిట్టాడుతుంటే దాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో సైతం పెట్టారు. రామచంద్రపురంలో మొక్కల రక్షణ కోసం వేసిన వలలో గురువారం కొండ చిలువ చిక్కుకోగా గ్రామస్తులు గమనించి దానిని హతమార్చారు.



జేసీ రాహుల్ మీనాకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అకస్మాత్తుగా బదిలీ చేశారు

న్యాయం చేయాలని జేసీకి గ్రామ సర్వేయర్ల వినతి

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 26: కాకినాడ జిల్లాలోని 30 మంది గ్రామ సర్వేయర్లను ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండా అకస్మాత్తుగా కోనసీమ జిల్లాకు బదిలీ చేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 20 మండలాల నుంచి 30 మంది గ్రామ సర్వేయర్లను ముందస్తు సమాచారం లేకుండా కోనసీమ జిల్లాకు బదిలీ చేశారన్నారు. చాలా మందికి కుటుంబ పరంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులున్నాయని తమ బదిలీలను పునః పరిశీలించాలని కోరారు.

కాకినాడ జిల్లా నుంచి 30మంది సర్వేయర్లను కోనసీమ జిల్లాకు బదిలీ చేసిన ఉత్తర్వులను పునః పరిశీలించాలని కలెక్టర్ షాన్ మోహన్‌ను సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు కోరారు.



కడియపులంకలో చిరుత సంచరిస్తున్నట్టు భావిస్తున్న ప్రాంతం (పైన) ట్రాప్ బోను (కింద)



కడియపులంకలోనే చిరుత

కదలికలను జల్లెడ పట్టి పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కడియం, సెప్టెంబరు 26: తూర్పు గోదావరి జిల్లా కడియం మండల ప్రజలకు మూడు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత పులి అడుగు జాడలను అటవీ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. కడియపులంక, బుర్రిలంక, దోసాలమ్మ కాలనీ వద్ద గమనించిన అటవీ శాఖ అధికారులు ఎస్.భరణి, ప్రసాదరావు చిరుతపులి కడియపులంక ప్రాంతంలోనే ఉందని తెలిపారు. పులి కదలికలను జల్లెడ పట్టి పరిశీలిస్తున్నామన్నారు. ఇందు కోసం ప్రొఫెషనల్ హెల్పర్లతో కలిపి కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ డివిజన్లకు సంబంధించి అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్లు, అటవీ శాఖ అధికారులు అంతా చిరుత పులిని పట్టుకునే పనిలోనే ఉన్నారు. పులి కదలికలను పరిశీలించేందుకు 20 కెమెరాలు, సోలార్‌తో పనిచేసే 4 సీసీ కెమెరాలు, 2 బోనులు ఏర్పాటు చేయించారు. రాజమహేంద్రవరంలో మరో ఆరు బోన్లు ఉన్నాయని, అవసరమైతే వాటిని కూడా తీసుకు వచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం రాత్రి పులిని పట్టుకునేందుకు కడియపులంక చుట్టూ అటవీ శాఖ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాత ఎవరూ బయట తిరగొద్దని, అవసరమనుకుంటే ముగ్గురు, నలుగురు కలిపి రావాలన్నారు. ఒకరోజు ఆలస్యమైనా ప్రజలకు ఇబ్బంది లేకుండా పులిని బంధిస్తామని అటవీ శాఖ అధికారులు చెప్పారు.

పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు

డీఎఫ్‌వోలు భరణి, ప్రసాదరావు



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ చిరుత పులి కొనసాగుతోంది. అది దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్టు నుంచి కడియం నర్సరీల్లోకి వెళ్లింది. దానిని పట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశాం. థర్మల్ డ్రోన్ సహాయంతో గమనిస్తున్నాం. కెమికల్ మొబిలైజేషన్ ద్వారా పట్టుకోవడానికి శిక్షణ పొందిన నిపుణులు కూడా వస్తున్నారు' అని తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎఫ్‌వోలు ఎస్.భరణి, ప్రసాదరావు తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భరణి మాట్లాడుతూ... చిరుత ఈనెల 19న దివాన్‌చెరువు ఆర్ఎఫ్‌లో చివరగా కనిపించిందని, ప్రస్తుతం కడియం నర్సరీల్లో దాని పాద ముద్రలు గుర్తించినట్టు తెలిపారు. వర్షాల వల్ల ఆ ముద్రలు ఎటువైపు ఉన్నాయనేది లభ్యం కాలేదన్నారు. ప్రస్తుతం ఏ నర్సరీలో ఉందో స్పష్టత ఉందని, 20 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని, నర్సరీ అసోసియేషన్‌కు చెందిన సీసీ కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. ట్రాప్ కేసు (బోను)లు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గోదావరి వరదల వల్లే ఇటు వచ్చి ఉంటుందని భావిస్తున్నామని, రిజర్వ్ ఫారెస్టులాగే సీతాఫలాల చెట్లు, నర్సరీలను కూడా అది నివాస ప్రాంతంగా భావిస్తుందన్నారు. కడియం ప్రాంతానికి కోనసీమ జిల్లా దగ్గరగా ఉండడం వల్ల ఆ ప్రాంతంలో కూడా అప్రమత్తం చేస్తున్నట్టు చెప్పారు. అది కచ్చితంగా ఏ ప్రాంతంలో ఉందో గమనించి, ఆయా నర్సరీల వైపు ఎవరూ వెళ్లకుండా అప్రమత్తం చేసినట్టు చెప్పారు. కోనసీమ డీఎఫ్‌వో ప్రసాదరావు మాట్లాడుతూ తమ జిల్లా పరిధిలోని ఏడిద, మెర్నిపాలెంల్లో నర్సరీలు ఉన్నాయని, అక్కడ కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం అది కుక్కలను తింటూ జీవిస్తోందన్నారు. చిరుత సంచరించే ప్రాంతాల్లో ప్రజలు బహిరంగ మల విసర్జన చేయవద్దని కోరారు. కడియపులంక సర్పంచ్ రాంజీ మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని వివరించారు.

బ్యాంకు కస్టమర్ పాయింట్‌లో రూ.15 లక్షలు స్వాహా

- ఏడాదిగా జరుగుతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు
- డ్వాక్రా సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఇంటిగ్రా కంపెనీ అధికారులు
- లబోదిబోమంటున్న డ్వాక్రా మహిళలు

అంబాజీపేట, సెప్టెంబరు 26: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం... బ్యాంకు అధికారుల ఉదాసీనత... డ్వాక్రా యానిమేటర్ల ఇష్టారాజ్యం... డ్వాక్రా సంఘ సభ్యుల పాలిట శాపంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ పరిధిలో ఇంటిగ్రా కంపెనీ ద్వారా బ్యాంకింగ్ కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్నారు. దీనిని నిర్వహిస్తున్న పరమట మణి డ్వాక్రా సభ్యులు చెల్లించిన రుణాలను బ్యాంకుకు గత ఏడాది నుంచీ చెల్లించట్లేదు. సుమారు రూ.15లక్షల మేర డ్వాక్రా సభ్యుల రుణాలు స్వాహా చేసినట్టు తెలిసింది. బ్యాంకు అధికారులకు అనుమానం రాకుండా డ్వాక్రా సంఘాలు చెల్లించిన రుణాన్ని ఒక నెల బ్యాంకుకు చెల్లించి మరో రెండు నెలలు స్వాహా చేసింది. ఈ వ్యవహారం ఏడాదిగా జరుగుతున్నా ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారులు, యానిమేటర్లు పట్టించుకోలేదు. బ్యాంకు అధికారులు యానిమేటర్లకు సూచించినా పట్టించుకోకపోవడంతో డ్వాక్రా సంఘాల సభ్యులు మోసపోయారు. ఈ విషయంలో బ్యాంకు అధికారులు, యానిమేటర్ల తీరుపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు పరిధిలోని 9 గ్రూపులకు సంబంధించి ఇప్పటివరకు రూ.15 లక్షలకుపైగా ఆ మహిళ స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.సిద్ధార్థ్ ద్వారా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యాంకుకు డ్వాక్రా సంఘాలు రుణాలు ఎందుకు చెల్లించట్లేదన్న వివరాలు సేకరించారు. అప్పటికే తాము బీసీ పాయింట్ నిర్వహిస్తున్న పరమట మణి ద్వారా రుణాలు చెల్లించామని మేనేజరుకు తెలిపారు. దీంతో ఆయన ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించారు. బ్యాంకు సర్వీస్ పాయింట్ నిర్వహిస్తున్న థర్డ్ పార్టీ ఇంటిగ్రా కంపెనీకి ఆ మేనేజరు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంటిగ్రా కంపెనీ క్లస్టర్ హెడ్ రఘుచంద్రన్, సూపర్‌వైజర్ నరేష్ గ్రామంలో సంఘ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. వివరాల సేకరణ అనంతరం ఎంత మొత్తం స్వాహా జరిగిందో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

జాతీయ కరాటే పోటీలకు వైష్ణవి ఎంపిక



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 26: కాకినాడలో ఈ నెల 22న జరిగిన కరాటే ఓపెన్ స్టేట్ టోర్నమెంటులో 65 కిలోల విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాల బీఎస్సీ సెకండియర్ విద్యార్థి ఎల్.వైష్ణవి గోల్డ్ మెడల్ సాధించింది. ఉత్తరాఖండ్‌లో నవంబరు 2,3 తేదీల్లో జరగబోయే జాతీయ పోటీలకు అర్హత సాధించిదని ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు తెలిపారు. వైష్ణవికి స్పోర్ట్స్ విభాగ అధిపతి పీఏ కిశోర్‌బాబు, డీవీ రమణ మూర్తి, బీహెచ్‌వీ మూర్తి, ఎంవీ నరసింహ అభినందనలు తెలిపారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రకాశ్‌బాబు

'కస్టడీలోకి తీసుకునే ముందు కారణాలు చెప్పాలి'

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకునే ముందు అందుకు కారణాలను అతడికి లేదా కుటుంబ సభ్యులకు కచ్చితంగా చెప్పాలని తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (డీఎల్ఎస్ఏ), సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ప్రీ-అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం-2012, ఆంధ్రప్రదేశ్ బాధితుల పరిహార పథకం-2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు నల్సా పరిహార పథకం-2018 తదితర అంశాలపై తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కల్యాణ మండపంలో గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ అరెస్టయిన వ్యక్తికి విచారణ సమయంలో తన న్యాయవాదిని కలిసే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక పరిస్థితులు లేనిపక్షంలో డీఎల్ఎస్ఏ అందించే ఉచిత న్యాయ సేవలు, ఉచితంగా న్యాయవాదిని పొందే హక్కు వారికి ఉందని తెలియజేయాలన్నారు. నోటీసు, అరెస్టు, చార్జ్‌షీట్, విచారణ, రిమాండ్... ఇలా ప్రతి దశలోనూ నిందితుడి హక్కులకు భంగం కలగకుండా పోలీసులు విధులు నిర్వర్తించాలని సూచించారు. బాధితులకు డీఎల్ఎస్ఏ ద్వారా అందిస్తున్న పరిహారంతో పాటు పలు చట్టాల గురించి వివరించారు. సదస్సులో పాడేరు అడిషనల్ ఎస్పీ జగదీశ్, సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్, మహిళా పీఎస్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



దాగ్ స్క్వాడ్‌తో గాలిస్తున్న అధికారులు

దొరకని హరదీప్ ఆచూకీ

- ఐదు రోజులుగా కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ఏఎన్ఎస్, డాగ్‌స్క్వాడ్‌లతో జల్లెడ పడుతున్న అధికారులు

మారేడుమిల్లి, సెప్టెంబరు 26: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి జలతరంగిణిలో ఆదివారం కొట్టుకుపోయిన ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల విద్యార్థి చింతకుంట్ల హరదీప్ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. మెడికో ఆచూకీ కోసం గత ఐదు రోజులుగా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఏఎన్ఎస్ పార్టీలను రంగంలోకి దించారు. డాగ్‌స్క్వాడ్ సాయంతో పాములేరు వాగు పరివాహక ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గాలింపు చర్యలకు వర్షం అడ్డంకిగా మారింది. అయితే అధికారులు తలతరంగిణి నుంచి పాములేరు వాగు వరకు, పాములేరు వాగు నుంచి వాగు పరివాహక ప్రాంతాన్ని డ్రోన్ కెమెరాను వినియోగిస్తూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు నీటి ప్రవాహంలో గాలిస్తున్నాయి. వాగు వెంబడి ఉన్న దట్టమైన పొదలు, అటవీ ప్రాంతంలో ఏఎస్పీ జగదీష్ అడహళ్లి నేతృత్వంలో యాంటీ నక్సల్స్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ అణువణువునా జల్లెడపడుతున్నాయి. గురువారం చీకటి పడే వరకు ప్రయత్నించినప్పటికీ హరదీప్ ఆచూకీ లభించలేదు. దొరికే వరకు గాలింపు చర్యలు కొనసాగిస్తామని అధికారులు చెప్తున్నారు. మరోపక్క కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి రవిప్రసన్న ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ, సీఐ మురళీకృష్ణ సిబ్బంది పలు సూచనలు చేస్తూ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.38 లక్షలు

ద్రాక్షారామ, సెప్టెంబరు 26: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో దేవదాయ శాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. 54 రోజులకు రూ.38,08,336 ఆదాయం వచ్చిందని దుర్గాభవాని తెలిపారు. లెక్కింపులో అర్చకులు, సిబ్బంది, భక్తులు, నాయకులు ముప్పనపల్లి గణేష్, పెంకె సాంబశివరావు, నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, కర్రా రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలి

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 26: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం ఆయన పొగాకు రైతులతో సమీక్షించారు. ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వచ్చే ఏడాది కూడా ఇలాగే ఉంటుందని రైతులు భావించవద్దన్నారు. ఈ ఏడాది ఏపీలో 170 మిలియన్ కిలోలు, కర్ణాటకలో 100 మిలియన్ కిలోల పరిమితిని బోర్డు ఇచ్చిందని, ఆ మేరకే రైతులు పంట సాగు చేయాలన్నారు. అధికంగా పండించిన పొగాకుకు అపరాధ రుసుము ఉంటుందని హెచ్చరించారు. ఆమోదయోగ్యంగా లేని చౌడు నెలల్లో, బడ్వాల్లోనూ పొగాకు పంట వేయవద్దని హెచ్చరించారు. గత ఏడాది బ్రెజిల్, జింబాంబ్వే దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గిందన్నారు. ఈ ఏడాది బ్రెజిల్, జింబాంబ్వే, కెన్యా, ఆఫ్రికా దేశాల్లో పొగాకు సాగు ఎక్కువగా చేశారని, రైతులు తక్కువ సాగులో ఎక్కువ ఉత్పత్తి చేసే విధంగా చూసుకోవాలన్నారు. ఈ ఏడాది ఎస్ఎల్ఎస్ ఏరియాలో సరాసరి ధర కిలో రూ.326 ఉండగా నల్లరేగడి నేలలో సరాసరి ధర రూ.282 ఉందన్నారు. అనంతరం దేవరపల్లి శివారు పల్లంట్ల రోడ్డులో పొగాకు నారుమడులను చైర్మన్ పరిశీలించారు. నారుమడులకు తెగుళ్ల సోకకుండా తగు జాగ్రత్తలు, సూచనలు చేయాలని బోర్డు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత, రైతు సంఘం నాయకులు కరుటూరి వెంకటశ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, కాట్రు సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, రైతులు సింహాద్రి ధర్మవతారం, యాగంటి సాయిబాబు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి
పదేళ్ల జైలు శిక్ష

సామర్లకోట, సెప్టెంబరు 26: మతి స్థిమితం లేని మహిళపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడిన చింతపల్లి నూకరాజుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు గురువారం తీర్పు చెప్పారు. ఎం.తరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు 202-2019, యూ-ఎస్ 376(2)(ఎం) ఐపీసీ పేరిట అప్పటి ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ వి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేసి నూకరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తదుపరి విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేశారు. రాజమహేంద్రవరం కోర్టులో ట్రయల్ జరగ్గా పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు ఫిర్యాది తరపున వాదన వినిపించా రు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయికి పై విధంగా శిక్ష విధించారని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ చెప్పారు.

భార్యను వేధించిన వ్యక్తికి
నాలుగేళ్ల జైలు

అన్నవరం, సెప్టెంబరు 26: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామంలో భార్యను వేధింపులకు గురిచేసిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువడినట్టు అన్నవరం ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు. కోటనందూరు మండలం బీబీ పట్నానికి చెందిన జిగిరెడ్డి అక్కన్నపాత్రుడు గిడజాం గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని, అనంతరం వేధింపులకు గురిచేయడం, కులం పేరుతో దూషించడం వంటి చర్యలతో ఆమె 2022లో అన్నవరంలో కేసు పెట్టిందని ఆయన వివరించారు. కాగా జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శ్రీలత నిందితుడికి నాలుగేళ్ల జైలు, రూ.2వేలు జరిమానా విధించారు.

ఇది ముంపు కాదట!



అధికారుల నిర్లక్ష్యంతో అందని పరిహారం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం మర్రిగూడెం గ్రామ ప్రథమ పౌరుడి ఇల్లు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు ఆ పంచాయతీ సర్పంచ్ సోడే రామయ్య ఇంట్లోకి నీరు చేరింది. ఆ గ్రామమంతా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇక్కడ సుమారు 50 కుటుంబాలు ఉండగా అందులో దళితులే ఎక్కువ. వారి ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో అడవుల్లో తలదాచుకున్నారు. కానీ ఈ గ్రామం ముంపులో లేనట్టు అధికారులు చెప్పడంతో పరిహారం రాలేదు. దీంతో తమకు అన్యాయం జరిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. సాక్షాత్తు సర్పంచ్ ఇల్లే నీట మునిగినా సచివాలయ అధికారులకు కనిపించలేదా అని విమర్శలొచ్చాయి. అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ తగు చర్యలు తీసుకుని తమకు పరిహారం అందించాలని మర్రిగూడెం గ్రామస్తులు కోరారు. మండలంలోని భీమవరం గ్రామంతో పాటు పెద ఆర్కూర్, ఆబిచర్ల సచివాలయాల పరిధిలో కూడా పరిహారం రాలేదు. దీంతో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి స్పందించి అల్లూరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. వెంటనే వారికి పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. - కూనవరం

ఏజెన్సీ సమాచారం

పారిశుధ్యంపై పర్యవేక్షణ ఏదీ

వై.రామవరం మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

వై.రామవరం, సెప్టెంబరు 26: 'వాతావరణ మార్పులతో మండలంలో వ్యాధులు ప్రబలుతున్నాయి... వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నదీ లేనిదీ తెలియట్లేదు... చెత్త, మురికి కూపాలపై పారిశుధ్య చర్యలు తూతూమంత్రంగా సాగుతున్నాయి... వీటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది' అని వై.రామవరం మండల సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపీపీ ఆనందరావు అధ్యక్షతన గురువారం జరిగిన జరిగిన సమావేశంలో సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. సర్పంచ్‌లను నామమాత్రంగా ఉపయోగించుకుంటున్నారని, అభివృద్ధి పనుల్లో వారికి ఎటువంటి విలువ ఇవ్వట్లేదని, ఇది సరైన విధానం కాదని ఎంపీపీ ఆనందరావు, ఈవోపీఆర్డీ శివకుమార్‌కు తెలిపారు. సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో పీవీటీజీలకు అన్యాయం జరుగుతోందని, పూరిగుడిసల్లో ఉన్న వారికే సోలార్ కనెక్షన్ ఇస్తున్నారని ఎంపీటీసీ కరక వెంకటరమణ ఆవేదన చెందారు. అడవి జంతువులకు కరెంటు తీగలను అక్రమంగా వినియోగించడంతో మరణాలు సంభవిస్తున్నాయని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్, అటవీ శాఖల అధికారులు పట్టించుకోవట్లేదని విద్యుత్ శాఖ ఏఈ అబ్బాయిదొరను ఎంపీపీ నిలదీశారు. నిర్లక్ష్యం కారణంగా దేవరమడుగుల, పి.యర్రగొండ గ్రామాల్లో ఇటీవల ఇద్దరు చనిపోయారని ఎంపీపీ తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తోందన్నారు. 2016లో చాపరాయిలో 16 మంది జ్వరాలతో మరణించగా అప్పటి టీడీపీ ప్రభుత్వం అభివృద్ధికి విడుదల చేసిన కోట్లాది రూపాయలు దుర్వినియోగమయ్యాయని ఎంపీటీసీ రమణ ఆరోపించారు. లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసేంత వరకు అధికారులు బాధ్యత తీసుకోవాలని కోరారు. వై.రామవరం-గుర్తేడు మధ్య తారు రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి నిలిచిపోయిందని, ఎప్పటికి పూర్తవుతుందని సభ్యులు ప్రశ్నించారు. ఐటీడీఏ ద్వారా ప్రభుత్వానికి రూ.2కోట్లు చెల్లించిన వెంటనే పనులు పూర్తవుతాయని అటవీ శాఖ డీఆర్వో బదులిచ్చారు. విద్య, వ్యవసాయం, మైనర్ ఇరిగేషన్, ఉపాధి హామీ తదితర అంశాలపై చర్చించారు. జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి, ఎంపీడీవో బాపన్నదొర, తహసీల్దారు అనసూయ, ఎంఈవో తాతబ్బాయిదొర పాల్గొన్నారు.

కొండరెడ్ల అభివృద్ధికి చర్యలు



ఐటీడీఏ ఏపీవో రమణ

రంపచోడవరం, సెప్టెంబరు 26: ఏజెన్సీలో కొండరెడ్ల (పీవీటీజీ) అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాయని ఐటీడీఏ ఏపీవో (జి) డీఎన్‌వీ రమణ పేర్కొన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. గృహాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, విద్య, వైద్య సేవలు, నెట్వర్క్ సౌకర్యం, అంగన్‌వాడీ కేంద్రాలు... తదితర 11 రకాల అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అక్టోబరు 2న ఐటీడీఏలో జరిగే కార్యక్రమంలో పీవీటీజీలకు హెల్త్ కార్డులు, వైద్య శిబిరం, గిరిజన కొమ్ముడ్యాన్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, డీఎల్‌పీవో కె.కోటేశ్వరరావు, ఏపీడీ జె.శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏఏవో ఎల్.రాంబాబు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, ఎంపీడీవో హరికృష్ణ, సీడీపీవో సంధ్యారాణి, డీఈఈలు చైతన్య, మల్లికార్జునరావు, రాజేంద్రబాబు, ఎస్‌వో మార్తమ్మ, ఎస్ఐ మోహన్‌రావు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి చర్యలు

రంపచోడవరం, సెప్టెంబరు 26: ఏజెన్సీలో మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ఏపీవో (జీ) డీఎన్‌వీ రమణ పేర్కొన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో ఏపీడీ డేగలయ్యతో కలిసి ఏడు మండలాల డీపీఎంలు, ఏపీఎం లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. అన్ని మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయించే బాధ్యత సంబంధిత అధికారులపై వుందన్నారు. ఏజెన్సీలో స్వయం సహాయక మహిళా సంఘాలు ఎన్ని ఉన్నాయి, ఎంతమంది సభ్యులు ఉన్నారో మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. డీపీఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, కిషోర్, శ్యామ్, ఏపీఎంలు పాల్గొన్నారు.

'రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు'

మోతుగూడెం, సెప్టెంబరు 26: కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వై.రామవరం మండలం డొంకరాయి మార్కెట్ వీధిలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీటీసీ కరకా వెంకటరమణ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రానున్న వంద రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని భరోసా ఇచ్చారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, మావూరి సత్యనారాయణ, అనిల్, శివ, బాబీ, మూర్తి, సచివాలయ సెక్రటరీ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ

దేవీపట్నం, సెప్టెంబరు 26: రంపచోడవరం ఐటీడీఏ నూతన డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు గురువారం మండలంలోని శరభవరం, దామనపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులు, శానిటేషన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు చెప్పే పాఠాలను పరిశీలించి స్లో లెర్నర్స్ పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రంపచోడవరం ఏటీడబ్ల్యువో రామతులసి, హెచ్ఎంలు నూకాలమ్మ, చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అక్రమ రవాణాను అడ్డుకుంటాం'

దేవీపట్నం, సెప్టెంబరు 26: అటవీ ప్రాంతాల నుంచి అక్రమంగా తరలించే వాటిని అడ్డుకునేందుకు మూడు శాఖల అధికారులు సన్నద్ధమయ్యారు. గురువారం ఇందుకూరుపేట తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖల అధికారులు సమావేశమయ్యారు. తహసీల్దారు రామకృష్ణ, ఎస్ఐ షరీఫ్, ఇందుకూరు రేంజ్ అధికారి దుర్గాకుమార్ మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తామన్నారు. అక్రమ కలప, ఇసుక, నిషేధిత ప్రాంతాల్లో చేపల వేట, బియ్యం రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

మార్చి 31లోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ఎటపాక, సెప్టెంబరు 26: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా 2021-22లో మంజూరైన ఇళ్లను వచ్చే ఏడాది మార్చి 31లోపు పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి జి.మురళి కోరారు. గురువారం ఆయన ఎటపాక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమం ద్వారా గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో మంజూరైన ఇళ్లకు మాత్రమే బిల్లులు విడుదలవుతాయని చెప్పారు. నిధులు మంజూరైన లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ, అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాయశ్చిత్త దీక్ష



ఎటపాక, సెప్టెంబరు 26: తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గురువారం జనసేన మండల శాఖ అధ్యక్షుడు మారాసు గంగాధర్ వెంకటరెడ్డిపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని శుద్ధి చేశారు. బీజేపీ నాయకులు సోముల రామారావు, పాయం వెంకయ్య సంఘీభావం తెలిపారు. జనసేన యూత్ ప్రెసిడెంట్ కొమ్ము వెంకట్, గోవిందు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు సీతారాం ఏచూరి

కడియం, సెప్టెంబరు 26: సీతారాం ఏచూరి దేశానికి ఎంతో మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) అన్నారు. సీతారాం ఏచూరి బాల్యంలో నివసించిన ఇంటిని గురువారం ఆయన సందర్శించారు. యూటీఎఫ్ నాయకుడు చిలుకూరి శ్రీనివాసరావు జేగురుపాడులో సీతారాం ఏచూరి బాల్యం నాటి ఇంటిని, గడిపిన ప్రదేశాలను చూపించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థి నేతగా, కమ్యూనిస్ట్ నాయకుడిగా, పార్లమెంటేరియన్‌గా అన్ని కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహించి బాధిత వర్గాల తరుపున ఎలుగెత్తి చాటిన గొంతు సీతారం ఏచూరి అన్నారు.

సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర పునఃనిర్మాణం

» 'ఇది మన మంచి ప్రభుత్వం' సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 26: ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేస్తే ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో 7,8,13,14,15 డివిజన్లకు సంబంధించి స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని వెలుగు పార్కు వద్ద జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, వంటివి చేశామన్నారు. వరదల్లో నష్టపోయిన వారిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుందన్నారు. దీపావళి నుంచి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రావేణుగోపాలరాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందని, రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలోకి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, రెడ్డిమణి, బుడ్డిగ రాధ, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



గోకవరం: రంపయర్రంపాలెంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

ప్రజా సంక్షేమం కాంక్షించే ప్రభుత్వం: జ్యోతుల

గోకవరం, సెప్టెంబరు 26: ప్రజా సంక్షేమం కాంక్షించేది కూటమి ప్రభుత్వమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో సర్పంచ్ బాదంపూడి హర్షిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పలు సంక్షేమ పథకాల అమలుతో సీఎం చంద్రబాబు ప్రజాభిమానాన్ని చూరగొన్నారన్నారు. ఒక్క రంపయర్రంపాలెం గ్రామానికే సుమారు రూ.50 లక్షల నిధులను తాను తీసుకొచ్చినట్టు చెప్పారు. రంపయర్రంపాలెం-గోకవరం రోడ్డును డిసెంబరు నెలాఖరుకు తారు రోడ్డుగా మారుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజల నుంచి ఎమ్మెల్యే నెహ్రూ సమస్యలు అడిగి తెలుసుకొని వారి నుంచి వినతులు స్వీకరించారు. పలు ఇళ్లకు వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉంగరాల రాము, ఉంగరాల గణేష్, తుమ్మలపల్లి రమేష్, గంగాధర్, కన్నబాబు, అడపా భరత్, గాజింగం సత్తిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో సర్పంచ్ సత్తి వీరమణి అధ్యతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో జేఏ ఝాన్సీ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మంచి ప్రభుత్వం అనిపించుకుందన్నారు. పలువురు అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో చింతా శ్రీనివాసరెడ్డి, చిన్నం వీరభద్రారెడ్డి, డీటీ సత్యకృష్ణ, ఏవో శామ్యూల్ జాన్, ఏపీవో అగస్టీన్‌కుమార్, ఎంఈవో పూర్ణచంద్రరావు, కార్యదర్శి కె.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఇద్దరి ఎంపిక

బిక్కవోలు, సెప్టెంబరు 26: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాల్ బాడ్మింటన్ పోటీలకు కాపవరం ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్ఎం పి.గోపాలకృష్ణారావు గురువారం తెలిపారు. తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.మల్లేశ్వరి, డి.సౌజన్య ఈనెల 24న మండపేటలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వచ్చేనెలలో ఏలూరు జరిగే పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు పీఈటీ చైతన్యరెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి నాయకులు అభినందించారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన మల్లేశ్వరి, సౌజన్య

జిల్లా క్రీడా పోటీలకు రంగంపేట విద్యార్థులు

రంగంపేట, సెప్టెంబరు 26: రంగంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 24 వరకు అనపర్తిలో జరిగిన నియోజక వర్గస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో బాలికల 600 మీటర్ల పరుగుపందెంలో డి.ప్రశాంతి, జి.యామిని ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుచుకున్నారన్నారు. డిస్కస్‌త్రోలో డి.నాగలక్ష్మి ప్రథమ స్థానాన్ని, ఖోఖోలో జి.నాగలక్ష్మి, వాలీబాల్‌లో వై.హర్షిత, యోగాలో డి.పూజిత, ఎం.సాహితి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్-14 బాలుర విభాగం, అండర్-17 బాలికల, బాలుర విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్ జంప్, జావెలిన్‌త్రో, చెస్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు పీడీ శైల, పీఈటీ చినబూరిబాబును ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కరాటేలో కాపవరం యువకుడికి గోల్డ్‌మెడల్

అనపర్తి, సెప్టెంబరు 26: ఇటీవల కాకినాడలో జరిగిన ఏపి స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2024 పోటీల్లో బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన దొడ్డే చందుబాబు స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా గురు వారం అనపర్తి ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలం పూడి సుధాకరరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు తాడి గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చందుబాబును అభినందించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరాటేలో తన ఉన్నతికి తోడ్పడిన మాస్టర్ లోవరాజుకు చందు కృతజ్ఞతలు తెలిపారు.



చందుబాబును అభినందిస్తున్న నాయకులు

వరద బాధితుల సహాయార్థం విరాళాలు



సీఎం చంద్రబాబుకు చెక్కును అందిస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 26: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న గీత ముళ్లపూడి ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ముళ్లపూడి రాజేంద్రప్రసాద్, సంగీత దంపతుల కుమార్తె వేద శ్రీసాయి రూ.1.08 లక్షలు అందజేసింది. శ్రీసాయి ప్రస్తుతం పదో తరగత చదువుతోంది. తాను పొదుపు చేసుకున్న మొత్తాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సమక్షంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్ రూపంలో అందించారు. అలాగే రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు రూ.లక్ష విరాళం అందించింది. ఈ మేరకు గురువారం స్థానిక తిలక్‌రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గౌతమి ఘాట్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ కామర్స్ ట్రస్టు కార్యదర్శి బాలనాగు బలేష్‌గుప్తా సమక్షంలో ప్రతినిధులు కలిసి చెకును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు మద్దుల మురళీకృష్ణ, యియ్యపు మురళీధర్, కోసూరి సుబ్బరాజు, సహాయ కార్యదర్శులు యలమర్తి బాబు, దేవత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ సాయం

రాజమహేంద్రవరంలో గోదావరి వరదలకు ఇబ్బందులు పడిన 54 మత్స్యకార కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంది. స్థానిక చందాసత్రంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే వాసు రూ.5.40 లక్షల పరిహార చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, సీఎం చంద్రబాబు మత్స్యకార కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, యిన్నమూరి దీపు, నల్లం శ్రీను, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకిరామయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వాసుకు చెక్ అందిస్తున్న చాంబర్ ట్రస్ట్ ప్రతినిధులు

ఇంటి వద్దకే తపాలా సేవలు

గోకవరం, సెప్టెంబరు 26: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు ఇంటి వద్దే అందించనున్నట్టు రంపచోడవరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చందక తాతూనాయుడు అన్నారు. మండలంలోని పెంటపల్లిలో తపాలశాఖ ఆధ్వర్యంలో డాక్ చోపాల్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టాఫీసు సేవింగ్స్, రికరింగ్ డిపాజిట్స్ ఖాతాలకు సంబంధించిన సేవలు, పదేళ్లలోపు ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి అకౌంట్లు, గ్రామీణా తపాలా జీవిత బీమా పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రంపయర్రంపాలెం పోస్ట్‌మాస్టర్ సూర్య పాల్గొన్నారు.

రంగంపేటలో అక్రమ బాణసంచా స్వాధీనం

రంగంపేట, సెప్టెంబరు 26: అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ టి.కృష్ణసాయికి ముందుగా వచ్చిన సమాచారంతో రంగంపేటలో గురువారం తనిఖీలు నిర్వహించగా గళ్లా సత్యశ్రీనివాసరావు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

'భరత్.. కార్పొరేటర్‌గా కూడా గెలవలేవు'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 26: తనను తాను ఎక్కువగా ఊహించుకుని అవాకులుచవాకులు పేలుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్ ఇప్పటికే ఎంపీ నుంచి ఆ పార్టీ నగర అధ్యక్షుడిగా దిగజారిపోయాడని ఇప్పుడు అతను తనపై కార్పొరేటర్‌గా పోటీ చేసినా గెలవలేడని తెలుగు యువత నేత యిన్నమూరి దీపు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవారి భక్తుల నుంచి ఎదురౌతున్న ఛీత్కారాలు, నిరసనలను తట్టుకోలేక ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని వారిలో సింగిల్ సినిమా హీరో భరత్‌రామ్ ఒకరని ఎద్దేవా చేశారు.

మాధవరాయుడుపాలెంలో అగ్ని ప్రమాదం

కడియం, సెప్టెంబరు 26: మండలంలోని మాధవరాయుడుపాలెంలో గురువారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో అన్నందేవుల వీరబాబు ఇల్లు, కిరాణా షాపు, టీ స్టాల్ కాలిబూడిదయ్యాయి. సమాచారం తెలియగానే సర్పంచ్ అన్నందేవుల చంటి సంఘటనాస్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారిని రప్పించారు. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కిరాణా సరుకులు, హోటల్ సామగ్రి, ఇంట్లో విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.11 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని సర్పంచ్ చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే అన్నారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యాంపస్‌లోని ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను కలెక్ట్ చేశారు. ప్లాస్టిక్ రహిత కళాశాలగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మిగిలిన విద్యార్థులకు తెలియజేశారు. వలంటీర్లను మునిసిపల్ కమిషనర్ కేతన్‌గర్గ్ అభినందించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మల్లికార్జున, భవానీ, మురళీకృష్ణ, సుభాషిణీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల విజ్ఞాన యాత్ర



రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వాణిజ్య, నిర్వహణశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు 60 మంది పరిశ్రమల సందర్శన, విద్యా పర్యటనలో భాగంగా విశాఖపట్నం బీహెచ్ఈఎల్, ఆంధ్రా యూనివర్శిటీలను సందర్శించారు. బీహెచ్ఈఎల్ కంపెనీ మేనేజర్ శాస్త్రి, సూపర్‌వైజర్లు, హెచ్ఆర్ విభాగాధిపతులు విద్యార్థులకు కంపెనీ ఉత్పత్తి విభాగాలను స్వయంగా చూపించి వాటి పనితీరును వివరించారు. అనంతరం ఆంధ్రా యూనివర్శిటీ సందర్శనలో రెక్టార్ ఎస్.కిషోర్‌బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వాణిజ్య, నిర్వహణ విభాగాలను విద్యార్థులు సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎ.నరసింహ మాట్లాడారు. అధ్యాపకులు సునంద, ప్రతిమ, నాయుడు, హరితలోచన, మణిరత్నం, శబరీష్, ఫణీంద్ర పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విరమణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26: బ్యాంకుల యాజమాన్యం, యూనియన్ల మధ్య జరిగిన చర్చలు సఫలం కావడంతో ఈనెల 27న జరుపతలపెట్టిన దేశ వ్యాప్త బ్యాంకు అధికారులు, ఉద్యోగుల సమ్మె విరమించినట్టు బ్యాంకు ఆఫీసర్స్ యూనియన్, ఉద్యోగుల సంఘం నాయకులు వెల్లడించారు. ఈ మేరకు నాయకులు ఎస్.లక్ష్మీపతిరావు, రామకృష్ణ, స్వాతి, గౌతమ్, మురళీధర్, ఎంఎస్ఎన్ రాజు, డీవీ ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు.

'ఉపాధి'లో లక్ష్యాలు డిసెంబరు నాటికి

సిద్ధం చేయాలి: కలెక్టర్



రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 26: ఉపాధి హామీ పథకం కింద లక్ష్యాలను డిసెంబరు నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, పశు సంవర్ధక శాఖ అధికారులతో ఇంజనీరింగ్ పనుల పురోగతి, కార్యచరణపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 200 రోజులు అభివృద్ధి ప్రణాళిక ప్రకారం శాఖల వారీగా లక్ష్యాలను ఇచ్చిందని, ఇప్పటికే 100రోజుల కార్యాచరణ ప్రకారం ఆయా శాఖల పనితీరుతో పాటు రానున్న వందరోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉండాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి నియోజకవర్గం పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉందని ఆ మేరకు గుర్తించిన పనులకు సంబంధించి సోమవారం నాటికి పరిపాలన పరమైన ఆమోదప్రతులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రాధాన్యత పనుల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమేరకు ఇండెంట్ పంపాలని కలెక్టర్ తెలిపారు. పరిపాలన ఆమోదం తదితర ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ-ఆఫీసు ద్వారా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు చేపట్టే రహదారి పనులను చేపట్టడంపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. రహదారులు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పనులను చేపట్టాలన్నారు. జిల్లాకు మినీ గోకులం కింద 675 యూనిట్లు మంజూరయ్యాయని, డెల్టా ప్రాంత మండలాలకి 50, మెట్టప్రాంత మండలాలకు 25 చొప్పున నిర్మాణాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి లబ్ధిదారులకు చెందిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదం ఇవ్వడంతో పాటు సమాంతరంగా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆర్.శ్రీరాముల నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎండీ ఆలీముల్లా, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ బీవీ గిరి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు, డివిజనల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే తిరుమలకు జగన్: ఎమ్మెల్యే జ్యోతుల

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 26: తిరుపతి శ్రీవారి లడ్డూ తయారీ విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అపచారంపై ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే పులివెందుల ఎమ్మెల్యే జగన్ తిరుపతికి వెళ్తున్నాడని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణం ఉందని, అయితే మత విద్వేషాలను రెచ్చగొట్టి ఘర్షణలు తేవాలని ఇతర మతానికి చెందిన జగన్ ప్రయత్నిస్తున్నాడని, ఇందులో భాగంగా తిరుపతికి వస్తున్నట్టు ప్రకటించాడని ఆరోపించారు. గత ఐదేళ్లలో చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా వెళ్తున్నానంటే తప్పేమిలేదన్నారు. అయితే టీటీడీ నిబంధనలకు లోబడి వెళ్లాలని, అఫిడవిట్ దాఖలు చేసి వెళ్లాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, అడపా భరత్‌కుమార్, కన్నబాబు, ధారా యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

8 ద్విచక్ర వాహనాల స్వాధీనం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): 20ఏళ్ల వయసుకే అంతర్ జిల్లా దొంగలుగా మారిపోయిన ఇద్దరిని అరెస్టు చేసిన వన్‌టౌన్ పోలీసులు.. చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎన్.మురళీ కృష్ణ వివరాల ప్రకారం.. వన్‌టౌన్ పరిధిలో ఈ నెల 9న నమోదైన బైక్ దొంగతనం కేసులో దర్యాప్తులో భాగంగా రాజమహేంద్రవరం ఆదెమ్మదిబ్బకు చెందిన దమ్ము దుర్గారావు(దమ్ము), గిడుతూరు ప్రవీణ్ సాయి(పండు)ని నిందితులుగా గుర్తించి గురువారం అరెస్టు చేశారు. వాళ్లు ఇచ్చిన సమాచారంతో రూ.3లక్షలు విలువ చేసే 8 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశామని సీఐ చెప్పారు. గడిచిన 3 నెలల్లో వన్‌టౌన్, టూటౌన్, రాజానగరం, దేవరపల్లితోపాటు గూడూరు పోలీస్ స్టేషన్లలో వాళ్లపై ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులు నమోదు అయ్యాయన్నారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ మురళీ కృష్ణ, ఎస్ఐ జె.ఆదినారాయణ, సిబ్బంది పి.మహేశ్, ఎస్‌కే రబ్బాని, జి.వెంకటేష్‌లను సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు, ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

సంస్కరణవాది చిలకమర్తి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 26: భారతీయతను చాటుతూ ఆంగ్ల పాలకులపై నిప్పులు చిమ్ముతూ భరత ఖండంబె ఒక గొప్ప బందిఖానా అంటూ నాటి దేశ పరిస్థితులను కళ్లకు కట్టిన సంస్కరణవాది చిలకమర్తి లక్ష్మీనరసింహం అని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధిపతి పీవీబీ సంజీవరావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పరిశోధనా కేంద్రం, పురావస్తు శాఖ, ప్రదర్శన శాలల శాఖ ఆధ్వర్యంలో వంకాయల వీధిలోని కందుకూరు గృహంలో గురువారం జరిగిన చిలకమర్తి జయంతిలో ఆయన మాట్లాడారు. చిలకమర్తి రాసిన గయోపాఖ్యానం నాటకం ప్రతులు లక్షపైబడి అమ్ముడయ్యాయన్నారు. పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు మాట్లాడుతూ బ్రహ్మ సమాజం, హితకారిణి సమాజాలను 13 ఏళ్లపాటు ఏకధాటిగా నడిపిన ఘనత చిలకమర్తిదని అన్నారు. కార్యక్రమంలో చీరల సీతారామనాయుడు, ఎండీ మోస, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణకు నిధులివ్వాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 26: పాఠశాలల నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు ఏటా నిధులు మంజూరు చేసేదని, దాదాపు మూడేళ్లుగా ఈనిధులు విడుదల నిల్చిపోవడంతో పాఠశాలల్లో అత్యవసరమైన పనులకు ఉపాధ్యాయులు తమ సొంత సొమ్మును ఖర్చు పెడుతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ విషయంలో చొరవ తీసుకుని పాఠశాలల నిర్వహణా నిధులను విడుదల చేయాలని కోరారు.





గోదావరి జిల్లాలు.. ప్రకృతి అందాలకు కేరాఫ్ అడ్రస్. అడుగడుగునా ఓ ప్రత్యేకత. ఆకుపచ్చని లోకంలో విహరించాలంటే ఖచ్చితంగా ఇక్కడకు రావాల్సిందే. ప్రకృతి రమణీయతకు అద్దంలా కనిపించే పచ్చని పైరు పంటలు.. కోనసీమ కొబ్బరి తోటల అందాలు ఎవరినైనా ఈ కొత్త లోకంలో విహరింపజేస్తాయి. ఇక పేరులోనే ఉన్న గోదావరి.. పరవళ్లు తొక్కే గోదావరికి ఆనుకుని పరుగులు పెట్టే పంట కాల్వలు, మరోవైపు దట్టమైన అడవి.. అందులో ఎగిసిపడే వాగులు..వంకలూ.. మరోవైపు పాపికొండల వయ్యారాలు..ఇటు చూస్తే అంతమే లేదన్నట్టు సాగిపోయే తీరంలో సముద్రపు అలల సవ్వడి.. ఇంకా కడియం పూలతోటలు.. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే ఆలయాలు.. అన్నిటికీ మించి అన్నవరం దేవాలయం. పర్యాటకం అంటే ఊటీకో, గోవాకో వెళ్లడం కాదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రండి.. చూస్తే పరవశించిపోవాల్సిందే..

- కాకినాడ/ రాజమహేంద్రవరం/ అమలాపురం (ఆంధ్రజ్యోతి)

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఎన్నెన్నో.. అందాలు



ఉమ్మడి జిల్లాలో ఊటీ..కొడైకెనాల్‌ను తలదన్నే పర్యాటక ప్రాంతాలు

- పర్యాటకానికి చిరునామా 'తూర్పు'
- గోదారి పరవళ్లు.. పచ్చని కోనసీమ
- అపార బీచ్‌లు.. ఏజెన్సీ అందాలు
- ఆధ్యాత్మికత.. పూల సోయగాలు
- కూటమి దృష్టిపెడితే..ఆదాయవనరు
- పట్టించుకుంటే ఇదే స్వర్గసీమ
- నిధుల లేమితో ప్రాజెక్టులు మూలకు
- పర్యాటకంగా కానరాని అభివృద్ధి
- తాజాగా రూ.100 కోట్లతో ప్రాజెక్టు

ఓ వైపు కొబ్బరి చెట్లతో తివాచీ పరిచినట్టు పచ్చగా కనిపించే కోనసీమ.. ఇంకో వైపు గోదావరి నడుమ పాపికొండల వయ్యారాలు.. మరో వైపు మారేడుమిల్లి అటవీ అందాలు.. ఇంకోపక్క కాకినాడ సమీపంలో కోరింగ అభయారణ్యం.. ఇలా చెప్పుకుంటూపోతే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువేలేదు. కోరుకొండ, ఆదుర్రు, కొడవలిలో బౌద్ధ స్తూపాలు, పెద్దాపురంలో పాండవులమెట్ట వంటి చారిత్రక ప్రదేశాలెన్నో ఉన్నాయి. ఇక అన్నవరం, అప్పనపల్లి, అంతర్వేది, అయినవిల్లి, మురమళ్ల, ముక్తేశ్వరం, వాడపల్లి, కోటిపల్లి, ర్యాలీ, ద్రాక్షారామ, పిఠాపురం తదితర ప్రాంతాల్లో చారిత్రక దేవాలయాలూ ఉన్నాయి. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న పాపికొండల విహారం ఆహ్లాదభరితం. ఎత్తయిన కొండలు, అటవీప్రాంతం మీదుగా వంపులు తిరుగుతూ ప్రవహించే గోదావరి అందాలను బోటులో నుంచి వీక్షించవచ్చు. గోదావరి తీరంలో ఉన్న చారిత్రక నగరం రాజమహేంద్రవరం. గోదావరి గట్టున ఉన్న రాళ్లబండి మ్యూజియం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ, గౌతమి గ్రంథాలయం, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం ఇల్లు, పెద్ద మసీదు వంటివి చూడదగ్గవి. గోదావరి తీరంలో గౌతమిఘాట్‌ను ఆనుకుని టెంపుల్ స్ట్రీట్‌లో ఇస్కాన్ తదితర ఆలయాలు ఉన్నాయి. రాజమహేంద్రవరం అఖండ గోదావరిలో బోట్ షికారు నిర్వహిస్తున్నా సరైన నిర్వహణ లేక దానికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. పుష్కర ఘాట్‌లో నిత్య హారతి కార్యక్రమం వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కింది. రాజమహేంద్రవరానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధవళేశ్వరంలో 1852లో కాటన్ మహాశయుడు నిర్మించిన బ్యారేజీ తప్పక చూడాల్సిందే. రూపాయి ఖరీదు చేసే మొక్క నుంచి లక్షల విలువ చేసే దేశ, విదేశీ రకాల మొక్కలూ కడియం మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటుచేసిన 600 నర్సరీల్లో కనిపిస్తాయి. వశిష్ఠ పాయ ఒడ్డున కోనసీమలో కొలువుదీరిన దిండి దశాబ్దకాలంలో పర్యాటకంగా బాగా ప్రాచుర్యం పొందింది. హరిత కోకోనట్ కంట్రీ రిసార్ట్స్ పేరుతో ఏపీ టూరిజం ఇక్కడ రిసార్ట్స్ నిర్వహిస్తోంది. దిండిలో కేరళ తరహాలో ఉన్న హౌస్ బోట్లు ద్వారా నదీవిహారాలు సాగిస్తుంటారు. దిండి రిసార్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతి గదులతో పాటు నాలుగు హౌస్‌బోట్లు, ఒక వశిష్ఠ బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. దిండిలో టూరిజం రిసార్ట్స్‌తో పాటు సమీపంలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఆదుర్రులో బౌద్ధస్థూపం చరిత్రకెక్కింది. కాట్రేనికోన మండలం కందికుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవుల్లో పడవల ద్వారా విహారయాత్ర సాగించడానికి అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రసిద్ధి చెందిన ఓడలరేవు, కొమరగిరిపట్నం, కేశనపల్లి, కేశవదాసుపాలెం,అంతర్వేది, ఎస్.యానాం, చిర్రయానం బీచ్‌లు వేలాదిమందితో కళకళలాడుతున్నాయి. కోనసీమలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి, గౌతమీనది చెంతన అయినవిల్లి సిద్ధి వినాయక, క్షణముక్తేశ్వరస్వామి, మురమళ్ళ వీరేశ్వర స్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, కడలిలో కపోతేశ్వర స్వామి, వాడపల్లిలో వెంకటేశ్వరస్వామి, మందపల్లిలో శనేశ్వరస్వామి, ర్యాలిలో జగన్మోహినీ ఆలయాలు ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి.

రూ.100 కోట్లతో అఖండ గోదావరి

కూటమి ప్రభుత్వం తాజాగా పర్యాటక రంగంపై దృష్టిపెట్టింది. వచ్చే ఏడాది మార్చి నాటికి కొత్త పర్యాటక పాలసీని తీసుకొని రావడానికి కసరత్తు చేస్తోంది. గోదావరి జిల్లాల్లో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ జిల్లాకు చెందినవారే కావడంతో ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందు తుందనే ఆశలు చిగురించాయి.అఖండ గోదా వరి కి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్టు ఆయన స్పష్టం చేసి న సంగతి తెలిసిందే. ఇప్పటికే కడియం నర్సరీలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అక్కడ కాలువ లో బోట్ షికారు పెట్టనున్నా రు. పాపికొండలు ఇప్పటికే బోట్ షికారుతో ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే.



మడ అడవులు చూస్తే..మరువరు

దేశంలో పశ్చిమబెంగాల్ తర్వాత రెండో అతిపెద్ద మడ అడవులు కాకినాడలోనే ఉన్నాయి. వేల ఏళ్ల నాటి ఈ మడ అడవులు కాకినాడ నగరానికి రక్షణ గోడగా నిలుస్తున్నాయి. సునామీలు, వరదలు, తుపాన్ల నుంచి కాకినాడతో పాటు కోనసీమలో ఎన్నో ప్రాంతాలను రక్షిస్తున్నాయి. నదీ జలాలు సముద్రంలో కలిసే చోట చిత్తడినేలల్లో పెరగడమే వీటి ప్రత్యేకత. సాధారణంగా ఉప్పునీటిలో చెట్లు పెరగవు. కానీ ఇవి అందులోనే పెరిగి, ఊత వేర్లతో ఒకదానికొకటి పెనవేసుకుపోయే చెట్లు, పొదల సముదాయమే మడ అడవులు. తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో మడ అడవులు విస్తరించి ఉన్నాయి. నది.. సముద్రంలో కలిసే ప్రదేశంలో సహజసిద్ధంగా పుట్టుకువచ్చే ఈ మడఅడవులు ప్రాంతాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా కేంద్రం గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మడ అడవులను మొత్తం తొమ్మిది అభయారణ్యాలుగా గుర్తించారు. ఇందులో కోరంగి అభయారణ్యం అతి పెద్దది. ఇది 42.42 చదరపు కి.మీలో విస్తరించి ఉంది.వీటిలో 80 రకాల వృక్షజాతులున్నాయి.అతిపెద్దదైన కోరంగి అభయారణ్యంలో 24 కుటుంబాలకు చెందిన 35 జాతుల మడ మొక్కలున్నాయి. ఇక్కడకు ఏటా 120 జాతుల పక్షులు వచ్చి విడిది చేస్తుంటాయి. ఎంతో మంది పర్యాటకులు వస్తున్నా సరైన సదుపాయాలే లేవు.

ఏజెన్సీ అందాలకు వెలుగేది..

చూపుతిప్పుకోలేని ప్రకృతి అందాలు తూర్పు ఏజెన్సీ సొంతం. మారేడుమిల్లి సమీపంలో అటవీశాఖ ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్వహిస్తోంది. వనవిహారి పేరుతో మారేడుమిల్లిలో రిసార్ట్స్‌లో వసతి ఏర్పాట్లు కల్పించారు. ఈ రిసార్ట్స్‌లో స్టే చేయాలంటే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవాలి. ఎకో టూరిజంలో ప్రధానమైన పర్యాటక ప్రాంతం జంగిల్ స్టార్. ఇది పాములేరు వాగు పక్కనే ఉంది. పాములేరు బ్రిడ్జి నుంచి కిలోమీటరున్నర దూరం ఉంటుంది. జంగిల్ స్టార్ నేచురల్ క్యాంపులో గడిపాలనుకునే వారికి ఒక రాత్రంతా అడవిలో గడిపిన అనుభూతి కలుగుతుంది. కొంతకాలంగా గుడిసె అందాలను ఆస్వాదించడానికి పెద్దఎత్తున పర్యాటకులు వస్తున్నారు. వెదురుబొంగులలో పెట్టి తయారుచేసిన బొంగు చికెన్, బొంగు బిర్యాని ఇక్కడ స్పెషల్. మారేడుమిల్లికి 6 కిలోమీటర్ల దూరంలో జలతరంగిణి, కాఫీ తోటలు పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తాయి. ఇటు రంపచోడవరానికి 6 కిలోమీటర్ల దూరంలో రంప ఉంది. ఇక్కడ 14వ శతాబ్దంలో నిర్మించిన శివాలయం ప్రాశస్త్యం పొందింది. శివాలయానికి కిలోమీటరు కొండపైకి వెళితే జలపాతం ఆకట్టుకుంటోంది. ఇన్ని అందాలున్నా వాటి అభివృద్ధికి మాత్రం ఎలాంటి చర్యలు లేవు. కూటమి ప్రభుత్వం దృష్టి పెడితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యాటకరంగానికి మరింత శోభ చేకూరుతుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడేలా చేయడానికి రంగం సిద్ధమవుతోంది. హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు నుంచి మడ అడవుల వరకు అభివృద్ధి చేయడానికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి.

అందాలున్నా..ఆదరించలేదు..

ఓ వైపు సువిశాల సుముద్ర తీరం..మరోవైపు జలజల పారే నదీ జలాలు..ఈరెండింటి మధ్య పొదలుగా...గుబురుగా.. సూర్యుడి వెలుతురు కూడా చొరబడనంత దట్టంగా విస్తరించిన మడ అడవులు.. కాకినాడ కాజా..ఎన్టీఆర్ బీచ్..కుంభాభిషేకం.. అన్నవరం, పాదగయ..ఉప్పాడ బీచ్..ఉప్పాడ చీరలు.. పెరుమాళ్లపురం పాకంగారెలు.. చిట్టి ముత్యాల బిర్యానీ.. చిట్టిపెసరట్టు...ఇలా ఒకటేంటి కాకినాడ అంటే పర్యా టకులకు ఇలా చాలానే గుర్తొచ్చేవి.. పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉన్నా గత వైసీపీ ప్రభు త్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసేసింది.పైసా నిధులు కూడా విదల్చకుండా పర్యాటక రంగానికి తూట్లు పొడిచింది. గడచిన ఐదేళ్లలో పర్యాటక రంగం పడకేసింది. వాస్తవానికి 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో పర్యాటక రంగానికి భారీ ఊపుతెచ్చింది. కాకి నాడ నుంచి ఉప్పాడ వరకు ఉన్న బీచ్‌రోడ్డును అభివృద్ధి చేసి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించింది.ఎన్టీఆర్ బీచ్‌ను అభివృద్ధి చేసి పర్యాటక ఉత్సవాలు, రోజుల తరబడి బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించింది.వైసీపీ వచ్చాక వీటన్నింటికి మంగళం పాడేసింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పర్యాటక అభి వృద్ధిపై దృష్టి సారించింది. పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్ ఇప్పటికే సీఎం వద్ద పలు ప్రతిపాదనలు ఉంచారు. కాకినాడ జిల్లాలో అన్నవరం,పాదగయ, సామర్లకోట భీమేశ్వర ఆలయం.. ఉప్పాడ బీచ్ కలిపి టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఎన్నికల సమయంలో డిప్యూటీ సీఎం పవన్ ఈ దిశగా హామీ కూడా ఇవ్వడంతో దీని అమలుపై కార్యాచరణ ప్రణాళికలు రచిస్తున్నారు.

వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీ..



వచ్చే ఏడాది కొత్త పర్యాటక పాలసీని తీసుకుని రానున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీ వచ్చే మార్చి వరకూ అమలులో ఉంటుంది. మార్చి తర్వాత కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. రాబోయే ఐదేళ్లలో పర్యాటక రంగ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం. అఖండ గోదావరి ప్రాజెక్టుతో రాజమహేంద్రవరం అఖండ గోదావరి, కడియం, హేవలాక్, చారిత్రిక కట్టడాలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలోని ప్రాంతాలు, పశ్చిమగోదావరి జిల్లాలో పేరుపాలెం బీచ్ వంటివన్నీ అభివృద్ధి చేస్తాం. - **కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి**

కొవ్వూరు ఆర్‌డీవోగా రాణి సుస్మిత

రాజమహేంద్రవరం,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఆర్డీవోగా రమావత్ కృష్ణనాయక్, కొవ్వూరు ఆర్డీవోగా రాణి సుస్మిత నియమితులయ్యారు. టూరిజం రాజమహేంద్రవరం ఆర్‌డీ వి.స్వామినాయుడును పలాస ఆర్డీవోగా నియమించారు.ఈ మేరకు గురువారం రాత్రి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఎస్ఐ, హెచ్‌సీలకు కౌన్సెలింగ్

నేడు 250 మంది కానిస్టేబుళ్లకు..

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు సిబ్బంది బదిలీ ప్రక్రియ మొదలైంది.ఈ మేరకు ఎస్పీ నరసింహ కిషోర్ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఐదేళ్లగా ఒకే చోట పనిచేస్తున్న సుమారు 80 మంది ఏఎస్ఐ, హెచ్‌సీలతో స్వయంగా మాట్లాడి నిర్ణయం తీసుకున్నారు. సిబ్బంది వినతులను పరిగణనలోకి తీసుకొని వారు కోరిన పోలీస్‌స్టేషన్‌లో ఖాళీ ఉంటే కేటాయించారు. 250 మంది కానిస్టేబుళ్లకిశుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఇరిగేషన్‌లో పలువురు బదిలీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్‌లో పలువురు బదిలీ అయ్యారు. పులిచింతల ప్రాజెక్టు సర్కిల్ పరిధిలో డీఈగా పనిచేస్తున్న రెడ్డెం అప్పారావు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ధవళేశ్వరం సీఈ పరిధిలోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు జంగారెడ్డిగూడెం ఎస్ఈగా నియమితులయ్యారు. పీపీఐ డివిజన్ -3లోని ధవళేశ్వరం ఎస్ఈగా ఉన్న పాకనాటి వేంకటేశ్వర్లు క్వాలిటీ కంట్రోలు సీఈగా నియమితులయ్యారు. మరం దక్షిణమూర్తి, పమ్మి నాగార్జునరావు, ఎస్.జగదీశ్వరరావు ,కలిగితిరాజు, కిలివేటి రమేష్ తదితరులకు ధవళేశ్వరం సర్కిల్‌లో పోస్టింగ్ దక్కింది.

మైన్స్ ఏడీగా ఫణిభూషణ్‌రెడ్డి బాధ్యతలు

జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎం.సుబ్రహ్మణం కడప బదిలీ అయ్యారు.

రూ.5 కోట్ల స్థలం.. హాంఫట్!



- హుకుంపేటలో ఇంటి దొంగలు
- పంచాయతీ కామన్ సైట్ కబ్జా
- కోర్టు తీర్పు ఇచ్చినా నో పెన్సింగ్
- పీజీఆర్ఎస్‌లో కూటమి ఫిర్యాదు
- నేటికీ పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 26 : ఇంట్లో దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడన్నది సామెత..ఆ సామెతకు నిలువెత్తు నిదర్శనంగా కొంత మంది అధికారుల తీరు ఉంది. అయినా పట్టించుకునేవారే లేరు.. గతంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే అధికారులు అడ్డుకునేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారుల తీరులోనూ మార్పువచ్చింది. కబ్జాదారులకు అధికారులే సహకరించి..ఎంతో కొంత స్థలం తీసుకునే కొత్త విధానానికి ఆజ్యం పోశారు. రాజమహేంద్రవరం రూరల్‌లో జరిగే సంఘటనలే అందుకు నిదర్శనం. దీంతో కబ్జాదారులు ఇష్టానుసారం రెచ్చిపోయి ప్ర భుత్వ భూముల ఆక్రమణలకూ దిగారు.కలెక్టరేట్‌కు కూతవేటు దూరం.. అయినా కబ్జాలకు అంతే లేకుండాపోయింది. ఒక పక్క ధవళేశ్వరం మరో పక్క హుకుంపేటలో కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగు తోంది. కబ్జాదారులకు అధికారులు సహకరించడంతో కొన్ని భూముల వ్యవహారాలు దశాబ్దకాలం దాటినా బయటపడలేదంటే ఎలా పావులు కదిపారో అర్థం చేసుకోవచ్చు.

1333 గజాల స్థలం ఆక్రమణ..

రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట పంచాయతీ పరిధి రామకృష్ణ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ ప్రాంతంలో వేసిన ఎల్‌పి నంబరు 624/85 లేఅవుట్‌కు సంబంధించి సామాజిక స్థలం (కామన్‌సైట్) సుమారు 1333 గజాలు హుకుంపేట పంచాయతీలో పనిచేస్తున్న వారితో పాటు పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న ఆరుగురు ఏకంగా రిజిస్టరు చేయించుకున్నారు. ఈ విషయం బయటకు రావడంతో అప్పటి డీఎల్‌పీవో కోటేశ్వరబాబు విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు సంబంధిత స్థలం పంచాయతీకి సంబంధించిందంటూ నివేదిక సమర్పించారు. ఫోర్జరీ డాక్యుమెంట్లపై అమ్మిన వారితో పాటు కొనుగోలు చేసిన వారిపై కూడా క్రిమినల్ కేసులు బనాయించాలంటూ డీఎల్‌పీవో ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత స్థలం కొనుగోలుదారులు 2010 లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణల అనంతరం జనవరి 2011లో ఈ స్థలం పంచాయతీకి చెందిన సామాజిక స్థలం అని కోర్టుతీర్పునిచ్చింది. అటుపై పంచాయతీ అధికారులు ఆ స్థలం గురించి పట్టించుకోలేదు. పంచాయతీ కార్యదర్శిగా విధులు చేపట్టి ఇటీవల పదవీ విరమణ పొందిన శ్రీనివాస్ ఎస్.వెంకట సూర్యనారాయణ తదితరులు ఇంటి నిర్మాణం కోసం ప్లాన్ అప్రూవల్ ఇచ్చేశారు.. అప్పటి డీఎల్‌పీవోగా విధులు నిర్వహిస్తున్న కేపీ చంద్రశేఖర్ గాని సంబంధిత అధికారులు గాని ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కోర్టు ఆర్డరు అనుకూలంగా ఉన్నా కోట్లాది రూపాయల విలువ చేసే స్థలానికి పెన్సింగ్ కూడా వేయలేక పోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం అక్కడ గజం విలువ సుమారు రూ.40 వేలు పైనే ఉంది.అంటే ఈ లెక్కన స్థలం విలువ రూ. 5.32 కోట్లు ఉంటుంది. ఇదే విషయమై ఇటీవల పీజీఆర్ఎస్‌లో కూటమి నాయకులు మత్సేటి ప్రసాద్, ముద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ తదితరులు ఫిర్యాదు చేసారు. రూరల్ మండలం పరిధి పిడింగొయ్యి పంచాయతీలో సుమారు 70 అధికారిక లేఅవుట్లు ఉండగా 6వ లేఅవుట్లలో సామాజిక స్థలం కబ్జాకు గురైనట్టు తెలుస్తుంది.మరి కొన్ని చోట్ల పంచాయతీ అధికారుల సహకారంతో ఏకంగా ఇళ్ళ నిర్మాణాలే చేపట్టారు. ఇటువంటివి క్షేత్రస్థాయిలో చాలానే ఉంటాయి.

పెన్సింగ్ వేయమని ఆదేశించిన డీపీవో..

హుకుంపేట ఎఫ్‌సీఐ కాలనీ ప్రాంతంలో కబ్జాకు గురైన స్థలానికి పెన్సింగ్ వేయాలంటూ అప్పటి డీపీవో రాంబాబు గ్రామ కార్యదర్శి వెంకట్రావును ఈ నెల మొదటి వారంలో ఆదేశించారు. కోర్టు ఆర్డరు అనుకూలంగా ఉన్నా నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారంటూ నిలదీశారు. అయినా ఇప్పటికీ పెన్సింగ్ వేయకుండా వదిలేశారు.

దివ్యాంగులతో ఆటలా!?



సదరం శిబిరానికి కానరాని ఏర్పాట్లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26 : దివ్యాంగులతో అధి కారులు సదరంగం ఆడు తున్నారు. ఎంతో కష్టపడి ఆసుపత్రికి వచ్చినా వారికి కనీస సౌకర్యాలు కానరాక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ప్రతి గురువారం సదరం శిబిరం నిర్వహిస్తు న్నారు. శాశ్వత అంగవైకల్యానికి రూ.15 వేలు పింఛను అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో దివ్యాంగులు తరలివస్తున్నారు.అయితే అందుకు తగినట్టు ఏర్పాట్లు మాత్రం చేయ డంలేదు. ఈ వారం కూడా దివ్యాంగులు భారీగా తరలిరావడంతో జీజీహెచ్ ఆవరణ అంతా నిండిపోయింది. సాధారణ ఓపీ నమోదు కేంద్రంలోని మహిళా విభాగం కిటకిటలాడింది. దరఖాస్తులను పరిశీలించి ఆయా విభాగాలకు పంపే ప్రక్రియలో తీవ్ర జాప్యం జరగడంతో సంబంధిత విభాగాల వైద్యులు అసహనం వ్యక్తం చేశారు. దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా కనీస చర్యలు తీసుకోకపోవడం, అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ విషయంలో వచ్చే గురువారమైనా తగిన జాగ్రత్తలు తీసుకుంటారా లేదా అనేది చూడాలి.

నర్సరీల మాటున చిరుత పులి 8
అటవీ అధికారుల జల్లెడ



అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం


గజ్జరంలో ఇంటింటికి కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, సెప్టెంబరు 26: మండలంలోని గజ్జరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథి విచ్చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని నియోజకవర్గం రోడ్లకు నిధులు కేటాయించానని అన్నారు. అనంతరం గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, కె.వంశీ తదితరులతో పాటు ఎంపీడీవో వెంకటరమణ, డీటీ భారతి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కొవ్వూరు, సెప్టెంబర్ 26: కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొవ్వూరు, పెరవలి, గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 31 అంగన్‌వాడీ ఆయాలు, వర్కర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఆర్డీవో రమావత్ కృష్ణనాయక్, మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారిణి కె.విజయకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య, సీడీపీవోలు ఇంటర్వ్యూలు చేశారు. ఇంటర్వ్యూల అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు, పెరవలి, గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోలు డి.మమ్మీ, ఎం.శ్రీలక్ష్మి, కె.నాగలక్ష్మి, సీడీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపికపై హర్షం


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెరవలి, సెప్టెంబరు 26: కాకరపర్రు హైస్కూలు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడంపై పలువురు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చేనెల 10న పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో కాకరపర్రు హైస్కూలు విద్యార్థులు వాతాడి ధనతేజ, సానబోయిన జితేంద్ర, పాటి యశ్వంత్ వెంకట్ పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సుందర జేమ్స్ పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో నిడదవోలు నియోజకవర్గంలో జరిగిన పోటీల్లో కూడా పలువురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం శ్రీరామచంద్రరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వీరికి శుభాకాంక్షలు తెలిపారు.

ధ్యానం కొనుగోలుపై శిక్షణ


మాట్లాడుతున్న జేసీ చిన్న రాముడు

నిడదవోలు, సెప్టెంబరు 26: ధాన్యం కొనుగోలు విధానంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్. చిన్నరాముడు అన్నారు. గురువారం నిడదవోలులోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో కొవ్వూరు డివిజన్ పరిధి లోని అధికారులకు, సిబ్బందికి ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ కొనుగోలుపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ టి.రాధిక, జిల్లా సహకార అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు, ఇన్‌చార్జ్ డీఎస్‌వో ఎం.నాగాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏఎస్‌ఓ జి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమిస్తే రోగాలు దూరం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు

దేవరపల్లి, సెప్టెంబరు 26: మానసిక ప్రశాంతత, ఒత్తిడిని అధిగమిస్తే గుండె జబ్బులు నిరోధించవచ్చని గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ అన్నారు. దేవరపల్లిలో సుమంత్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 29న ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా దేవరపల్లిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు సుమంత్ మాట్లాడారు. కార్యక్రమంలో దేవరపల్లి ఎస్సై సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించటం ఎంతో అభినందనీయమని డాక్టర్ సుమంత్‌ను అభినందించారు. దేవరపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ శరత్‌చంద్రిక, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, పరిమి శ్రీరామకృష్ణ, దేవరపల్లి బీహెచ్ఎస్ఆర్ అండ్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వెంకటరత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగులు పరామర్శ

నల్లజర్ల, సెప్టెంబరు 26: జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి ముళ్ళపూడి వెంకటరత్నం ఇటీవల మృతి చెందడంతో విశ్రాంత ఉద్యోగులు గురువారం ముళ్ళపూడి బాపిరాజును పరామర్శించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సంఘం అధ్యక్షులు ఐవి సత్యం,ఎస్ఎం ఆలీసాహెబ్,ఉప్పడా కామేశ్వరరావు,ఉన్నమట్లు వెంకటేశ్వరరావు,ఎస్ బాలయ్య,ఏసురత్నం,గొట్టిపాటి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పరామర్శ: ఇటీవల జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి వెంకటరత్నం మృతి చెందడంతో ఇది తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఫోన్‌లో ముళ్ళపూడి బాపిరాజుని, ఆయన సోదరుడు రామకృష్ణను పరామర్శించారు. తమ కుటుంబానికి అండగా ఉంటానని చెప్పినట్లు జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి పేర్కొన్నారు.

విద్యార్థిపై ర్యాగింగ్ యత్నం?

● పెద్దల సమక్షంలో క్షమాపణలు ● సర్దుమణిగిన గొడవ

నల్లజర్ల, సెప్టెంబరు 26: నల్లజర్ల మండలం ఆవపాడుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి తాడేపల్లిగూడెంలో ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం అక్కడున్న క్యాంటీన్‌లో స్నేహితులతో కలిసి ఆ విద్యార్థి స్నాక్స్ తింటున్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన సీనియర్స్‌ని చూసి ఆ విద్యార్థి నిలబడలేదని ఘర్షణ పడ్డారు. లెక్చరర్ రావడంతో ఎవరికి వారు వెళ్ళిపోయారు. కళాశాల బస్సులో ఆవపాడు విద్యార్థి ఇంటికి వస్తుండగా అతన్ని కొట్టేందుకు బస్సు ఎక్కే ప్రయత్నం చేయగా సీనియర్స్‌ని డ్రైవర్ బస్సు ఎక్కనీయలేదు. దీంతో వారు బైక్‌లపై ఆవపాడు విద్యార్థి ఇంటికెళ్ళి కొట్టే ప్రయత్నం చేశారు. ఇంతలో గ్రామస్థులు వారిని బంధించి పోలీసులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కబురుపెట్టారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పలువురు పెద్దలు క్షమాపణలు చెప్పించి వారిని వదిలి వేశారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

హుండీ లెక్కింపు

పెరవలి, సెప్టెంబరు 26: అన్నవరప్పాడులోనున్న వెంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు, అధికారుల సమక్షంలో 26 రోజులకు లెక్కించగా ప్రధాన హుండీలో లక్షా 53,576 రూపాయలు, అన్నదాన హుండీలో 3,205 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎం.రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎంవీ రామయ్య పలువురు భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాళ్లపూడి, సెప్టెంబరు 26 మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో గురువారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గ్రామ శివారులోని పేకాట స్థావరంపై దాడి చేసారు. ఈ దాడిలో అయిదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.2040తో పాటు పేక ముక్కలను స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 26: కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 నాటి రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని కోరుతూ రైల్వేమంత్రి అశ్వని వైష్ణవ్‌కు పోస్టుకార్డులు పంపారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం 300 మంది విద్యార్థులు కొవ్వూరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలని పోస్టుకార్డుపై ఉత్తరాలు వ్రాసి కేంద్ర రైల్వేమంత్రి అశ్వని వైష్ణవ్‌కు పోస్టు చేయాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.పద్మశ్రీ, రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు వి.టి.విల్సన్‌రాజు, కె.ఎస్.రాజు, మారుతి, యాలం రమేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయండి

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్


రైతులతో సమీక్షిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 26: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. దేవరపల్లిలో గురువారం పొగాకు వేలం కేంద్రంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఆమోదయోగ్యంగా లేని చౌడు, బద్వాల్లోనూ పొగాకు పంట వేయవద్దని హెచ్చరించారు. అనంతరం దేవరపల్లి శివారు పల్లంట్ల రోడ్డులో పొగాకు నారుమడులను పరిశీలించారు. నారుమడులకు తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు, సూచనలు చేయాలని బోర్డు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, వేలం నిర్వహణాధికారి పి.హేమస్మిత, రైతు సంఘం నాయకులు కరుటూరి వెంకట శ్రీనివాస్, ఆచంట గోపాలకృష్ణ, కాట్రు సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, రైతులు సింహాద్రి ధర్మవతారం, యాగంటి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నారుమడి దశలో అప్రమత్తంగా ఉండాలి

గోపాలపురం, సెప్టెంబరు 26: నారుమడి దశలో రైతులు అప్రమత్తంగా ఉండాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని వేలచింతలగూడెంలో నారుమడులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం పొగాకు బోర్డులో రైతు సంఘం నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిమితికి మించిన పొగాకును పండించ వద్దని పురుగుమందు అవశేషాల వినియోగం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్, రైతు సంఘం అధ్యక్షుడు రాము, పొగాకుబోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దే శేషగిరిరావు, రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, కాకర్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన చాగల్లు హైస్కూల్ విద్యార్థులు


స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన కలవలపల్లి విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థులు

చాగల్లు, సెప్టెంబరు 26: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాగల్లు హైస్కూల్ విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారు. ఏలూరులో ఈనెల 21న జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అండర్ 19 విభాగంలో పాల్గొని పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు జి.జాహ్నవిదేవి, ఆర్.నవ్య, జ్ఞానేశ్వరి, డి.మోనిక, ఎస్.గీతాశ్రావణి, ఈ.హారిక అక్టోబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈసందర్భంగా పీడీ విజయలక్ష్మి, పీఈటి ప్రేమ్‌చంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, ఇతర ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

స్విమ్మింగ్ పోటీలకు కలవలపల్లి విద్యార్థులు

కలవలపల్లి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం ఏలూరులో జరిగిన ఎంపిక పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. పదవ తరగతి విద్యార్థి కొయ్య కల్యాణ్, 9వ తరగతి విద్యార్థి కరుటూరి గణేష్ స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో పోటీలకు ఎంపికయ్యారు. వీరు అక్టోబరులో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారు. ఈసందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు జొన్నకూటి వీర్రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు కొయ్య గంగాధరరావు సహా గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.

కడియపులంకలోనే చిరుతపులి

అటవీశాఖ అధికారిణి భరణి


బోనులు దించుతున్న అటవీ సిబ్బంది

కడియం, సెప్టెంబరు 26: మూడు రోజులుగా కడియం మండల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుతపులి అడుగుజాడలను అటవీ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. కడియపులంక, బుర్రిలంక, దోసాలమ్మ కాలనీ వద్ద గమనించి కడియపులంక ప్రాంతంలోనే పులి ఉందని అటవీశాఖ అధికారులు ఎస్.భరణి, ఎంవీ ప్రసాదరావు తెలిపారు. దాని కదలికలను జల్లెడపట్టి పరిశీలిస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రొఫెషనల్ సహాయకులతో కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ డివిజన్లకు సంబంధించి అసిస్టెంట్ బీట్, సెక్షన్ ఆఫీసర్‌తో పాటు, డిప్యూటీ రేంజి ఆఫీసర్, రేంజి ఆఫీసర్లు, అటవీశాఖ అధికారులు చిరుతపులిని పట్టుకునేలో ఉన్నట్టు చెప్పారు. పులి కదలికలను పరిశీలించేందుకు 20 కెమెరాలు, సోలార్‌తో పనిచేసే 4 సీసీ కెమెరాలు, 2 బోనులు ఏర్పాటు చేయించామన్నారు. రాజమహేంద్రవరంలో మరో 6 బోన్లు ఉన్నాయని అవసరమైతే వాటిని కూడా తీసుకు వచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం రాత్రి పులిని పట్టుకునేందుకు కడియపులంక చుట్టూ అటవీశాఖ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత ప్రజలు బయట తిరగొద్దని, అవసరమనుకుంటే ముగ్గురు, నలుగురు కలిపి తిరగాలన్నారు. పులిని బంధించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్టు అటవీశాఖ అధికారులు చెప్పారు.

అగ్ని ప్రమాదంలో రూ.11 లక్షల ఆస్తినష్టం!


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన వస్తువులు

కడియం, సెప్టెంబరు 26: కడియం మండలం మాధవరాయుడుపాలెంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో అన్నందేవుల వీరబాబుకు చెందిన కిరాణా షాపు, టీస్టాల్, ఉంటున్న ఇల్లు బూడిదయ్యాయి. సమాచారం తెలియగానే సర్పంచ్ అన్నందేవుల చంటి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి రప్పించారు. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. వీరబాబుకు చెందిన కిరాణా సరుకులు, హోటల్ సామగ్రి, ఇంట్లోని విలువైన వస్తువులు ఆహుతయ్యాయి. సుమారు రూ.11 లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్టు బాధితుడు తెలిపారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లకే అంతర్ జిల్లా దొంగలుగా మారిన ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.మురళీకృష్ణ వివరాల ప్రకారం.. వన్‌టౌన్ పరిధిలో 9న నమోదైన బైక్ చోరీ కేసులో దర్యాప్తులో భాగంగా రాజమహేంద్రవరం ఆదెమ్మదిబ్బకు చెందిన దమ్ము దుర్గారావు(దమ్ము), గిడుతూరు ప్రవీణ్ సాయి(పండు)ని నిందితులుగా గుర్తించి గురువారం అరెస్టు చేశారు. వాళ్లిచ్చిన సమాచారంతో రూ.3లక్షలు విలువైన 8 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశామని సీఐ చెప్పారు. గడిచిన 3 నెలల్లో వన్‌టౌన్, టూటౌన్, రాజానగరం, దేవరపల్లితోపాటు గూడూరు పోలీస్ స్టేషన్లలో వాళ్లపై ద్విచక్ర వాహనాల చోరీ కేసులు నమోదు అయ్యాయన్నారు. కేసు ఛేదించిన సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ జె.ఆదినారాయణ, సిబ్బంది పి.మహేశ్, ఎస్‌కే రబ్బాని, జి.వెంకటేశ్‌లను సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు, ఎస్పీ నరసింహ కిశోర్ అభినందించారు.

సత్య శోధక్ సమాజ్ ఆవిర్భావ వారోత్సవాలు



ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, సెప్టెంబరు 26: సమాజ అసమానతలు రూపుమాపేందుకు పూలే మార్గం అనుసరణీయమని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు తీపర్తి వీర్రాజు అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సత్య శోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు తీపర్తి వీర్రాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడారు. దేశంలో ఒకటే మతం, ఒకటే జాతి, ఒకే ఎన్నికలు, ఒకే పన్ను విధానం అంటూ మరో పక్క తన ఫాసిస్ట్ విధానాలు అమలు చేస్తున్న నేపథ్యంలో సామాజిక అసమానతలు రూపుమాపేందుకు పూలే మార్గం సత్య శోధక్ సమాజ్ ఆశయాల కొనసాగింపు అవస్యమని వక్తలన్నారు. కార్యక్రమంలో పిచ్చా సూర్యకిరణ్, లంకాడ గణపతి, వీరరాఘవులు, సోమరాజు, కోనేటి మల్లేశ్వరరావు, కోడి అబ్బులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో లక్ష్యాలు డిసెంబరు నాటికి సిద్ధం చేయాలి: కలెక్టర్


కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 26: ఉపాధి హామీ పథకం కింద లక్ష్యాలను డిసెంబరు నాటికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, పశుసంవర్ధక శాఖ అధికారులతో ఇంజనీరింగ్ పనుల పురోగతి, కార్యాచరణపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి నియోజకవర్గం పరిధిలో సీసీ రోడ్ల పనులను చేపట్టాల్సి ఉందన్నారు. ఆ మేరకు గుర్తించిన పనులకు సంబంధించి సోమవారం నాటికి పరిపాలనపరమైన ఆమోదప్రతులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రాధాన్యత పనుల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమేరకు ఇండెంట్ పంపాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు మినీ గోకులం కింద 675 యూనిట్లు మంజూరయ్యాయని, డెల్టా ప్రాంత మండలాలకి 50, మెట్టప్రాంత మండలాలకు 25 చొప్పున నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆర్.శ్రీరాముల నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎండీ అలీ ముల్లా, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ బీవీ గిరి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు, డివిజనల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వాడపల్లి విద్యార్థులు

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొవ్వూరు, సెప్టెంబర్ 26: స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి పోటీలకు వాడపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. యుగందర్ కుమార్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిక్కాల జడ్పీ హైస్కూల్‌లో జరిగిన నియోజకవర్గ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, పరుగు పందెం పోటీలలో వాడపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖోలో వై.భాగ్యశ్రీ, యు.మనోజ్, వై. సంతోష్‌కుమార్, యు.నవీన్‌బాబు, కబడ్డీలో కె.లీలాకృష్ణ, కె.కుమారి, ఎ.వెంకటలక్ష్మి, కె.అస్మిత, ఎం.షర్మిల, డి.సత్యదుర్గ, సీహెచ్ దివ్య వాలీబాల్‌లో ఎ. మహేష్, పరుగు పందెంలో కె.లీలాకృష్ణ, ఎం.షర్మిల జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీ డి.రాంబాబులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కలతో లాభాలెన్నో..

ఉండ్రాజవరం, సెప్టెంబరు 26: మండలంలోని వేలివెన్ను గ్రామ ఉపసర్పంచ్, టీడీపీ యువ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సోదరుడు బూరుగుపల్లి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు గురువారం టీడీపీ శ్రేణులు, అభిమానుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామంలో బూరుగుపల్లి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితే భవిష్యత్తు తరాలకు సంపదగా మిగులుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ అత్తిలి సత్యనారాయణలతోపాటు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.


మొక్కను నాటిన ఉపసర్పంచ్ బూరుగుపల్లి

ఉపాధ్యాయులకు 12వ పీఆర్‌సీ ప్రకటించాలి

కొవ్వూరు, సెప్టెంబర్ 26: గత ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమలు కావలసిన 12వ పీఆర్‌సి అమలు చేయకపోవడం శోచనీయమని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అన్నారు. గురువారం కొవ్వూరు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. పీఆర్‌సి. డీఏ బకాయిలు, గత రెండు సంవత్సరాలుగా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న ఆర్జిత సెలవుల బకాయిలు, పిఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో టాయిలెట్ల ఫొటోలు ఉపాధ్యాయులకు తొలగించామని ప్రభుత్వం చెబుతుంటే విద్యా కమిటి లాగిన్‌ల్లో ప్రధానోపాధ్యాయులే పూర్తిచేయాలని, జిల్లా మొదటిస్థానంలో నిలపాలంటూ అధికారులు ఒత్తిడి చేయడం తగదన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు వల్ల జరిగిన లోపాలను సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జాని, కొవ్వూరు మండల అధ్యక్షులు విష్ణు, ప్రధాన కార్యదర్శి సలీం, కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, సెప్టెంబరు 26: పట్టణ పరిధిలో నేటి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలోని రామ్‌నగర్, గణేష్‌చౌక్, ఓవర్ బ్రిడ్జి డౌన్, పోలీస్ స్టేషన్ ఏరియా, గాంధీబొమ్మ సెంటర్, యర్నగూడెం రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్ రైల్వేగేట్, బసివిరెడ్డిపేట, గణపతి సెంటర్, యర్న గూడెం రోడ్డు, నెహ్రూనగర్, విద్యానగర్, బాపూజీనగర్, వైఎస్ఆర్‌నగర్, జగనన్న కాలనీల వాసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉండ్రాజవరంలో...

ఉండ్రాజవరం, సెప్టెంబరు 26: మండలంలోని సత్యవాడ, ఉండ్రాజవరం, వెలగదర్రు, తాడిపర్రు, చిలకపాడు గ్రామాల్లో నేటి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఎస్ఎస్ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్లు అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

పొలం పనులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు

కొవ్వూరు, సెప్టెంబర్ 26: పంట పొలంలో అక్రమంగా ప్రవేశించి పనులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ జె.ధర్మరాజు తెలిపారు. అత్తిలి గ్రామానికి చెందిన విప్పర్తి సుబ్బలక్ష్మికి కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో పంట భూమి ఉంది. పొలంలో పనులు చేసుకుంటుండగా సుబ్బలక్ష్మి చెల్లెలు కుమార్తె, ఆమె బంధువులు గురువారం అక్రమంగా ప్రవేశించి పనులకు ఆటంకం కలిగించారని కొవ్వూరు రూరల్ పోలీసులకు సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారు. దీనిపై కస్సే సత్యనారాయణ, కస్సే నవతేశ్వరి, కనకమహాలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జె.ధర్మరాజు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, సెప్టెంబర్ 26: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒకవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... కొవ్వూరు మండలం దొమ్మేరు సావరం అనంతలక్ష్మి కాలనీకి చెందిన సింగం దుర్గాప్రసాద్(37) తాపీపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం దుర్గాప్రసాద్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులుపాలు కావడంతో భార్య తల్లికి చెందిన బంగారు వస్తువులను బ్యాంకులో తాకట్టు పెట్టాడు. ఇంట్లో తెలిస్తే ఏం జరుగుతుందోనని భయపడి మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నామన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తాడిపర్రు, ఉండ్రాజవరం గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 26: మండలంలోని తాడిపర్రు, ఉండ్రాజవరం హైస్కూలులో గురువారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. తాడిపర్రులో గ్రామసర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఊరచెరువు వద్ద తుప్పలు తొలగించి చెత్తను తరలించారు. ఉండ్రాజవరం హైస్కూలులో ప్రధానోపాధ్యాయుడు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో చెత్త వల్ల వచ్చే అనర్థాలపై సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చాగల్లు, సెప్టెంబరు 26: మండలంలోని మార్కొండపాడు గ్రామ జనసేన అధ్యక్షుడు బోడెం వీరవెంకట సుబ్రహ్మణ్యం ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయ పడ్డారు. గురువారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు నాదెళ్ళ శ్రీరామ్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి చిరంజీవి, టీడీపీ నాయకులు సుంకవల్లి రమేష్, కాండ్రిక హరికృష్ణ, బండి శ్రీను, పుసులూరి అనిల్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

దేవరపల్లి సీఐగా నాగేశ్వరరావు నాయక్



దేవరపల్లి, సెప్టెంబరు 26: దేవరపల్లి సీఐగా బీ.నాగేశ్వరరావు నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు రేంజ్ వీఆర్ నుంచి దేవరపల్లి సీఐగా బదిలీపై వచ్చానని అన్నారు. సర్కిల్ పరిధిలో అందరికి అందుబాటులో ఉంటూ న్యాయం కోసం కృషి చేస్తానని అన్నారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు, కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బదిలీపై వెళుతున్న రెవెన్యూ సర్వేయర్‌కు సన్మానం

తాళ్లపూడి, సెప్టెంబరు 26: తాళ్లపూడి నుంచి బదిలీపై వెళుతున్న మండల సర్వేయర్ వీరాస్వామిని రెవెన్యూ, సర్వే సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవీంద్రనాద్, టీడీ భారతి మాట్లాడారు. రీ సర్వే లో ఎంతో కష్టపడి పనిచేసిన సర్వేయర్‌ను అందరం గుర్తు పెట్టుకుంటామని తెలిపారు. ఏఎస్‌వో జోడాల మాట్లాడుతూ వీరాస్వామి సర్వే అసిస్టెంట్స్‌కి ఒక గురువులాగా అందరికీ పలు సూచనలు, సలహాలు అందించారని ప్రశంసించారు. అనంతరం సచివాలయ సర్వేయర్‌లు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్ 1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	దేవర
రాధాకృష్ణ	దేవర
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్